PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 129 | విజయవాడ, సోమవారం 11 డిసెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 11 December 2023 | Rs

## ఈ ప్రతిజ్ఞలు చాలవు

- 30 శాతం లక్ష్యాన్ని మాత్రమే చేరుకుంటాం
- కాప్ 28 సదస్సుపై ఐఇఎ నివేదిక

5

## యుపిలో ఘోర ప్రమాదం.. 8 మంది సజీవ దహనం

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బరేలీ వద్ద హైవే పై శనివారం రాత్రి కారు, ట్రక్కు ఢీకొనడంతో మంటలు చెలరేగి చిన్నారితో సహా 8 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రమాదం జరిగిన తర్వాత కారులో మంటలు చెలరేగాయి. డోర్లు జామ్ అయ్యి, తెరుచుకోలేదు. కారులోని సెంట్రల్ లాక్ పడిపోవడంతో ఎవరూ బయటికి రాలేకపోయారు. దీంతో కారులో ఉన్న 8 మంది మంటలకు ఆహుతయ్యారు. మృతుల్లో ఓ చిన్నారి కూడా ఉంది. ఈ ప్రమాదానికి సంబంధించిన సిసిటివి ఫుటేజీ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. సమాచారం అందుకొని ఘటనా స్థలానికి చేరుకునేలోపే మంటల్లో కారు పూర్తిగా దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో కారు పంక్చర్ అయినందున ఎదురుగా ఉన్న ట్రక్కును కారు ఢీ కొట్టినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

# అబ్బుర పరిచిన నేవీ విన్యాసాలు...



నేవీ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



సముద్రంలో స్పీడ్ బోట్లపై దూసుకువెళ్తున్న నావికులు

**ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖ)**

విశాఖ తీరంలో ఆదివారం నిర్వహించిన నేవీ విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. నావికుల ప్రదర్శనలు ఒళ్లు జలదరింపజేశాయి. తూర్పు నౌకాదళం శక్తి సామర్థ్యాలకు ఈ విన్యాసాలు మచ్చుతునకగా నిలిచాయి. ప్రతి ఏటా డిసెంబర్ నాలుగున నేవీ డే సందర్భంగా నిర్వహించాల్సిన ఈ విన్యాసాలకు ఈసారి మిచౌంగ్ తుపాను ఆటంకంగా మారడంతో పదో తేదీకి వాయిదా వేశారు. ఈ క్రమంలో ఆదివారం నిర్వహించిన విన్యాసాలను తిలకించేందుకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై నేవీ అసాధారణ సామర్థ్యాలను కనులారా వీక్షించారు. యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ, నిఘా విమానాలు, హెలికాప్టర్ల ద్వారా నిర్వహించిన ఈ వ్యూహాత్మక విన్యాసాలతో కూడిన కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండుగగా సాగింది. నావికాదళానికి చెందిన మెరైన్ కమాండోలు తమ యుద్ధ ప్రదర్శనతో ఔరా అనిపించారు. మొదటగా హాక్ బాంబ్ బ్లాస్ట్ నిర్వహించారు. అనంతరం కమాండర్ వెంకట్ రామన్ బాబు సారథ్యంలో జలాంతర్గామి ఐఎన్ఎస్ సింధు శస్త్రతోనూ, కమాండర్ ఆశితోష్ బొగ్దే హాక్ విమానాలతో చేపట్టిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఇండియన్ నేవీ యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ కుతర్, ఐఎన్ఎస్ కింజర్, ఐఎన్ఎస్ కిల్తాన్, ఐఎన్ఎస్ రణ విజయ్, ఐఎన్ఎస్ శివాలిక్, ఐఎన్ఎస్ ఢిల్లీలు మూడు వరుసలుగా వచ్చి తమ ప్రదర్శనలతో ముచ్చటగొలిపాయి. నేవీ బ్యాండ్ వినసొంపుగా సాగింది. కార్యక్రమంలో తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, రాష్ట్ర మంత్రులు విడుదల రజని, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. విన్యాసాలు చూసేందుకు విశాఖ నగర వాసులు పోటెత్తారు.

## వచ్చే ఏడాది రూ.251 కోట్ల భారం

- రైల్వే, విద్యుత్ వాహనాల స్టేషన్లపై అదనపు వడ్డన
- ఎఆర్ఆర్‌లో డిస్కంల ప్రతిపాదన



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.251.33 కోట్ల భారం డిస్కంలు మోపాయి. రైల్వే, విద్యుత్ వాహనాల సబ్‌స్టేషన్లకు విద్యుత్ ధరను పెంచడం ద్వారా ఈ ఆదాయం డిస్కంలకు రానుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వార్షిక నివేదిక (ఎఆర్ఆర్)ను విద్యుత్ పంపిణీ సంస్థలు ఇటీవల ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి సమర్పించిన విషయం తెలిసిందే. దీంతోపాటు 2024-25 నుంచి 2028-28 నియంత్రణ కాలానికి సంబంధించిన బహుళ వార్షిక కాల వ్యవధి (మల్టీపుల్ ఇయర్ టారీఫ్)ను డిస్కంలు సమర్పించాయి. డిస్కంలు సమర్పించిన పూర్తి నివేదికలను ఇఆర్‌సి తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. డిస్కంలు ప్రతిపాదించిన టారీఫ్ ద్వారా రైల్వే ప్రయాణికులు, విద్యుత్ వాహన వినియోగదారులపై పడే అవకాశం ఉంది. రైల్వేకు డిస్కంలు ప్రస్తుతం అందిస్తున్న టారీఫ్‌పై యూనిట్‌కు రూ.1 పెంచనున్నాయి. అదేవిధంగా విద్యుత్ వాహనాల స్టేషన్ల నిర్వహణ కింద అందించే సబ్సిడీని తొలగించాయి. ప్రస్తుతం ఈ స్టేషన్లకు సుమారు రూ.6.07 కింద యూనిట్ ధరను అందిస్తున్నాయి. వీటికి ఇస్తున్న 10 శాతం సబ్సిడీని తొలగిస్తున్నామని, ఇకపై ఇవ్వబోమని పేర్కొన్నాయి. దీంతో యూనిట్ రూ.6.70లకు చేరనుంది. హరిత విద్యుత్ యూనిట్ టారీఫ్ రూ.0.75పైసల నుంచి రూ.1కు పెంచాయి. అదేవిధంగా హెచ్‌టి-టి(సి) ఇంటెన్సివ్ ఇండస్ట్రీలను జిఓ 112 ప్రకారం ప్రత్యేక సబ్ కేటగిరి కింద తీసుకురానున్నాయి. ప్రస్తుతం టారీఫ్‌లో చేసిన మార్పులు వల్ల ఇపిడిసిఎల్ రూ.100.44 కోట్లు, ఎస్‌పిడిసిఎల్ 100.16 కోట్లు, సిపిడిసిఎల్ రూ.50.73 కోట్లు చొప్పున ఆదాయం రూ.251.33 కోట్లు రానుంది. ఎస్‌పిడిసిఎల్ పరిధిలో రూ.7,683.49 కోట్లు, సిపిడిసిఎల్ పరిధిలో రూ.2,996.53 కోట్లు, ఇపిడిసిఎల్ పరిధిలో రూ.3,207.26 కోట్లు చొప్పున మొత్తం రూ.13,887.28 కోట్ల ఆదాయ లోటు ఉంది. యూనిట్ విద్యుత్ కొనుగోలు సరాసరి సగటు ఇపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ రూ.4.69, సిపిడిసిఎల్ రూ.4.70 చొప్పున ఉంటాయని పేర్కొంది.

**7.44 శాతం పెరగనున్న విద్యుత్ వినియోగం**

రానున్న ఐదేళ్లలో విద్యుత్ వినియోగం రాష్ట్రంలో 7.44 శాతం పెరగనుందని డిస్కంలు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి ప్రతిపాదించాయి. ప్రస్తుత సంవత్సరం 72,400 మిలియన్ యూనిట్లు (ఎంయు) అవసరం ఉందని డిస్కంలు పేర్కొన్నాయి. 2024లో 79,472 ఎంయులు, 2025లో 85,356 ఎంయులు, 2026లో 90,924 ఎంయులు, 2028లో 1,05,179 ఎంయులు, 2029లో 1,11,378 ఎంయులు అవసరమవుతుందని తెలిపాయి. మొత్తం 7.44 శాతం విద్యుత్ పెరుగుతుందని పేర్కొన్నాయి. అదే విధంగా పీక్ డిమాండ్ ఇప్పుడున్న దాంతో పోల్చుకుంటే 8.37 శాతం పెరగనుంది. ప్రస్తుత డిమాండ్ 12,293 మెగావాట్లు (మెవా)గా ఉంది. 2029లో ఇది 19,913 మెగావాట్లకు చేరుకోనుంది.

**రెండు ఒకేసారి ఎలా?**

డిస్కంలతో పాటు ట్రాన్స్‌కో, ఎస్‌ఎల్‌డిసి ఐదేళ్ల నివేదికలను ఎపిఇఆర్‌సికి సమర్పించాయి. సాధారణంగా ఐదేళ్ల నివేదిక సమర్పించిన తరువాత ఎఆర్ఆర్‌ను డిస్కంలు సమర్పిస్తాయి. దీంతో పాటు ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియపై కూడా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిస్కంలు కోరాయి. ఐదేళ్ల నివేదికపై విచారణ జరిపిన అనంతరమే ఎఆర్ఆర్‌పై విచారణ ఎపిఇఆర్‌సి విచారణ నిర్వహించాలి. ఐదేళ్ల నివేదిక, ఎఆర్ఆర్‌లపై ఒకేసారి ఇఆర్‌సి నిర్వహించనుంది. డిస్కంలు, ట్రాన్స్‌కో, ఎస్‌ఎల్‌డిసి సమర్పించిన నివేదికలను అధ్యయనం చేసేందుకు, అభ్యంతరాలు సిద్ధం చేసేందుకు సమయం సరిపోదని విద్యుత్ నిపుణులు, వినియోగదారులు అంటున్నారు. జనవరి 29, 30, 31 తేదీల్లో ఈ ఏడాది కూడా ఆన్‌లైన్ ద్వారానే ఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనుంది. అభ్యంతరదారులను బట్టి ఫిబ్రవరి ఒకటిన కూడా విచారణ జరిపే అవకాశం ఉందని కమిషన్ వెల్లడించింది.

## రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఉద్యమిద్దాం

- పలువురు వక్తల పిలుపు

2

# మూల హిందూత్వ మరింత సంఘటితం

- మీడియాపై నియంత్రణ, ధనబలంతో బిజెపి గెలుపు
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సిపిఎం పొలిట్‌బ్యూరో
- క్రిమినల్ చట్టాల బిల్లులను సభా సంఘానికి పంపాలి
- జమ్ముకాశ్మీర్‌లో తక్షణమే ఎన్నికలు జరిపించండి!

**న్యూఢిల్లీ :** మూల హిందూత్వ మరింత సంఘటితం కావడం, మత, కుల ప్రాతిపదికన ప్రజల్లో చీలికలు తేవడం, మీడియాపై నియంత్రణ, ధనబలం వల్లే ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బిజెపి స్పష్టమైన విజయాన్ని సాధించిందని సిపిఎం పొలిట్‌బ్యూరో తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 2018 నాటి ఎన్నికలతో పోల్చితే కొంచెం అటు ఇటుగా తన ఓటింగ్ బలాన్ని నిలబెట్టుకున్నా..రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఆ పార్టీ అధికారాన్ని కోల్పోయిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆ మూడు హిందీ రాష్ట్రాల్లోనూ బిజెపి తన ఓటు షేర్ పెంచుకుందని పొలిట్‌బ్యూరో విశ్లేషించింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. మూడు రాష్ట్రాల్లోనూ మూల హిందూత్వ ఓటు ఏకీకరణ జరిగిందని పొలిట్‌బ్యూరో ఆందోళన వ్యక్తం చేసింది. అత్యధిక స్థాయిలో మీడియా సంస్థలపై బిజెపి నియంత్రణ కలిగివుండటం, భారీ స్థాయిలో ధనబలం, కులాల ప్రాతిపదికన విరక్తికర చీలికలు తీసుకురావడం ఆ పార్టీ విజయానికి దారితీశాయని పేర్కొంది. తెలంగాణలో రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్/బిఆర్ఎస్‌ని ఓడించి కాంగ్రెస్ నిర్ణయాత్మక విజయాన్ని సాధించిందని తెలిపింది. ఏది ఏమైనా బిజెపి తన స్థాయిని ఇక్కడ కూడా మెరుగుపర్చుకుందని పేర్కొంది. ప్రజల జీవనోపాధులను రక్షించడానికి, ప్రజాతంత్ర హక్కులను, పౌర స్వేచ్ఛలను కాపడడానికి, గణతంత్ర భారతావని లౌకిక ప్రజాతంత్ర లక్షణాన్ని పరిరక్షించేందుకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులు సాగిస్తున్న ప్రయత్నాలను రెట్టింపు చేయాల్సిన అవసరాన్ని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

**మిచౌంగ్ బాధితులను ఆదుకోవాలి**

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మిచౌంగ్ తుపాను కారణంగా భారీస్థాయిలో నష్టం వాటిల్లడం పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర విచారం వ్యక్తం చేసింది. తమిళనాడులో 24 మంది, ఆంధ్రప్రదేశ్‌లో ఏడుగురు చొప్పున ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. వేలాది హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు ధ్వంసమయ్యాయని ఆందోళన వ్యక్తం చేసింది. ముంపు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోవడంతో ఇంకా ముప్పు కొనసాగుతోందని పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వం కష్టకాలంలో ఉన్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు తగినన్ని తాత్కాలిక నిధులను కూడా ఇప్పటి వరకు ఇవ్వడం లేదని పొలిట్‌బ్యూరో విమర్శించింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఉదారంగా స్పందించి పునరావాసానికి అవసరమైన వనరులను, సాంకేతిక సహకారాన్ని అందించాలని కోరింది.

**పాలస్తీనియన్లపై మారణకాండ**

గాజాలోనూ, అలాగే వెస్ట్‌బ్యాంక్‌లోనూ పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణకాండలో ఇప్పటి వరకు 17 వేల మంది పౌరులు చనిపోయారని, వీరిలో 70 శాతం మంది మహిళలు, చిన్నారులే ఉన్నారని సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ జాతి విద్వేష దాడులకు ముగింపు పలకాలని, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి, ఇజ్రాయిల్ బందీలను విడుదల చేయాలని ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయని పొలిట్‌బ్యూరో తెలిపింది. తక్షణమే కాల్పుల విరమణ, ఇజ్రాయిలీ బందీలందరినీ విడుదల చేయాలని పిలుపునిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఈ నెల 8న ఏకగ్రీవంగా తీర్మానం చేసే చివరి దశలో దానిని అమెరికా వీటో చేసి అడ్డుకోవడాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. తక్షణమే కాల్పులు విరమణ మిగతా 5లో

## తుపాను నష్టంపై రాష్ట్రం మాటలు... కేంద్రం మౌనం

- సిఎం జగన్ పంటల నష్టాన్ని పరిశీలించిన తీరు ప్రపంచ రికార్డ్!
- తుపాను నష్టానికి కేంద్రం రూ.10 వేల కోట్లు ఇవ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం నిర్వహించాలి
- రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్‌పై బిజెపిది మోసకారితనం : వి శ్రీనివాసరావు

2

## యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్



ఎన్.వెంకటేశ్వర్లు



కెఎస్ఎస్.ప్రసాద్

**ప్రజాశక్తి- ఏలూరు అర్బన్**

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, అధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్ ఎన్నికయ్యారు. ఏలూరులోని చలసాని గార్డెన్స్‌లో రెండు రోజులపాటు జరిగిన యుటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో చివరి రోజు ఆదివారం నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా కె.సురేష్‌కుమార్, ఎఎన్.కుసుమ కుమారి, కోశాధికారిగా బి.గోపీమూర్తి, కార్యదర్శులుగా బి.లక్ష్మీరాజు, ఎస్‌పి.మనోహర్ కుమార్, ఎస్.మురళీమోహనరావు, ఎన్.అరుణ కుమారి, ఎస్ఎస్.నాయుడు, ఎన్.నవకోటేశ్వరరావు, వి.కోటేశ్వరప్ప, కెఎ.ఉమామహేశ్వరరావు, రెడ్డి మోహనరావు, టి.అన్నారాము, బి.సుభాషిని, జివి.రమణ, ఎస్.కిశోర్‌కుమార్, ఎస్.జ్యోతిబసు, వి.శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టిఎస్ఎల్ఎస్.మల్లేశ్వరరావు, సభ్యులుగా బి.శ్రీదేవి, పి.రమణారెడ్డి, ఎంవి.సుబ్బారెడ్డి, జె.పట్నాయక్, ఎస్.జబీర్, టి.విజయ్‌కృష్ణ ఎన్నుకోబడ్డారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా ఎన్.కుమార్‌రాజా, ప్రచురణ కమిటీ చైర్మన్‌గా ఎం.హనుమంతరావు, కన్వీనర్‌గా కెఎస్ఎస్.ప్రసాద్ ఎన్నికయ్యారు.

## నూతన విద్యా విధానంతో పేదలకు విద్య దూరం

- యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో విఠపు బాలసుబ్రమణ్యం
- డిఎస్‌సి వెంటనే ప్రకటించాలని తీర్మానం

3

## 19న 'ఇండియా' ఫోరమ్ నేతల భేటీ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఇండియా ఫోరమ్ నేతల భేటీ ఈ నెల 19న ఢిల్లీలో జరగనుంది. ఈసారి కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ మూడు రాష్ట్రాల్లో ఘోర పరాజయం పాలైన దరిమిలా ఒంటెత్తు పోకడలు పోతామంటే కుదరదు. మిత్రులను సమ భాగస్వాములుగా పరిగణించి అందరితోనూ సఖ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో బిజెపి ఘన విజయం సాధించింది. దీంతో ప్రధాన ప్రతిపక్షం, ఇండియా ఫోరమ్‌కు చెందిన ప్రధాన పార్టీ కాంగ్రెస్ పై సీట్ల పంపకంలో ఒత్తిడి తెచ్చే అవకాశమూ లేకపోలేదు.

సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తో విభేదాలను కాంగ్రెస్ పరిష్కరించుకోవడంతో.. ఆయన ఈ సారి సమావేశానికి హాజరుకానున్నట్లు తెలుస్తోంది. అఖిలేష్, బీహార్ సిఎం నితీష్ కుమార్ గైర్హాజరుతో డిసెంబర్ 6న జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. వచ్చే ఏడాది జరగనున్న లోక్ సభ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని ఢీ కొట్టడానికి ప్రతిపక్ష నేతలు ఇండియా ఫోరమ్‌గా జతకట్టారు.

# 'ఆడుదాం ఆంధ్రా'కు ఆటస్థలాలేవీ?

- 5,951 సచివాలయాల్లో ఇదే పరిస్థితి
- ఉన్న వాటిల్లోనూ పాఠశాలలే గతి



నిర్వహణ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయిన విజయవాడలోని బ్రహ్మానంద స్టేడియం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా'కు అవసరమైన ఆట స్థలాలు అందుబాట్లో లేకపోవడం, 50 రోజుల్లోనే హడావుడిగా దాదాపు మూడు లక్షల మ్యాచ్‌లు నిర్వహించాలని నిర్ణయించడం విమర్శలకు దారితీస్తోంది. నాలుగున్నరేళ్ల నుంచి క్రీడలను పట్టించుకోకుండా ఎన్నికల ముందు 50 రోజుల్లోనే నిర్వహించాలని నిర్ణయించడం ఎన్నికల స్టంట్‌లో భాగమేననే అభిప్రాయం కలుగుతోంది. ఈ కార్యక్రమానికి రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ కనీసం ఆడేందుకు ఆట స్థలాలు లేని పరిస్థితి నెలకొంది. ఎపి క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుంది. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలను ప్రభుత్వం నిర్వహించనుంది. 37,14,062 మంది క్రీడాకారులు శనివారం నాటికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 23,553,53 మంది పురుషులు, 13,57,822 మహిళలు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 సచివాలయాలు ఉన్నాయి. ఈ క్రీడలను నిర్వహించేందుకు ఆట స్థలాలు లేవు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశం ఇప్పటివరకు రాకపోవడంతో అధికారులు కూడా ఆట స్థలాలపై దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు హడావుడిగా ఆడుదాం ఆంధ్రా రావడంతో అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నాయో వెతికే పనిలో పడ్డారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ ఆటలకు 10 సెంట్ల స్థలం ఉన్నా ఆడించొచ్చు. క్రికెట్‌కు స్థలం ఎక్కువగా కావాలి. 15,004 సచివాలయాల్లో 9,053 వాటిల్లోనే క్రికెట్ ఆడేందుకు స్థలాలు ఉన్నట్లు శాప్ గుర్తించింది. 5,951 సచివాలయాల్లో లేవు. గుర్తించిన వాటిల్లోనూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఆటస్థలాలు ఎక్కువగా ఉన్నాయి. ఖాళీ స్థలాలు లేని సచివాలయాల్లో క్రికెట్ ఎలా ఆడించాలోనని గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు తర్జనభర్జన పడుతున్నారు. గ్రామ స్థాయి మిగతా 2లో


## ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయి



**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్ నూతన ముఖ్యమంత్రిగా, అసెంబ్లీలో బిజెపి శాసనసభా పక్ష నేతగా గిరిజన నాయకులు విష్ణుదేవ్ సాయి ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన బిజెపి శాసనసభా పక్షం సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. మాజీ ముఖ్య మంత్రి రమణ్‌సింగ్‌ను బిజెపి పక్కనపెట్టింది. ఆదివారం సమావేశంలో విష్ణుదేవ్ సాయి పేరును రమణ్‌సింగ్ ప్రతిపాదించగా, మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే బ్రిజ్మోహన్ అగర్వాల్ బలపరిచారు. కుంకూరి నుంచి విష్ణుదేవ్ సాయి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నరేంద్రమోడీ తొలి క్యాబినెట్‌లో గనులు, ఉక్కు శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన విష్ణుదేవ్, 2020 నుంచి 2022 ఛత్తీస్‌గఢ్ బిజెపి అధ్యక్షులుగా పనిచేశారు. ఈ సమావేశానికి 54 మంది పార్టీ ఎమ్మెల్యేలు, అధిష్టానం నియమించిన ముగ్గురు పరిశీలకులు అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, దుష్యంత్ కుమార్ గౌతమ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఓం మాథుర్, కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవ్య, రాష్ట్ర కో-ఇన్‌చార్జ్ నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు.

# జిడిపి పెరిగింది సరే...

- కుటుంబ వ్యయం తగ్గుతోందెందుకు?
- పడిపోతున్న ఆదాయాలు
- ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో పెరిగిన కష్టాలు




**న్యూఢిల్లీ :** ఇటీవల విడుదలైన స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) గణాంకాలు ప్రభుత్వ వర్గాలకు, వాటికి మద్దతు తెలిపే ఆర్థికవేత్తలకు ఆనందం కలిగించి ఉంటాయి. 2023-24 రెండో త్రైమాసికంలో జిడిపి వృద్ధి 7.6%గా నమోదైంది. తొలి త్రైమాసికంలో ఈ వృద్ధి 7.8%గా ఉంది. సగటున ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో జిడిపి 7.7% వృద్ధి రేటు సాధించింది. ఈ గణాంకాలపై ప్రధాని నరేంద్ర మోడీ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది ఫలితమని చెప్పుకొచ్చారు.

దేశ ఆర్థిక పరిస్థితి ఆశించినంత గొప్పగా లేదని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఆర్థిక కష్టాలన్నింటికీ 7.6% వృద్ధి రేటు పరిష్కారం చూపుతుందని ప్రభుత్వ పెద్దలు ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, అసలు గణాంకాలు ఏం చెబుతున్నాయో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

రెండో త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) ప్రైవేటు తుది వినియోగ వ్యయం (పిఎఫ్‌సిఇ) కేవలం 3.1% మాత్రమే పెరిగింది. పిఎఫ్‌సిఇ అంటే దేశంలోని అన్ని కుటుంబాలు, వ్యాపార సంస్థలు, ఇతర కంపెనీలు చేసిన మొత్తం ఖర్చు. జిడిపి లెక్కించే దేశ సగటు ఉత్పత్తిలో ఇది ఓ ముఖ్యమైన భాగం. జిడిపిలో ఇది సుమారు 57%గా ఉంటుంది. ప్రజలు వస్తువులు, సేవలు కొనుగోలు చేయడానికి ఎక్కువ ఖర్చు చేసినప్పుడు ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. ప్రజలు ఎక్కువ ఖర్చు చేయకపోతే ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగదు. కాబట్టి ప్రజల కొనుగోలు, ఆదాయ శక్తిని లెక్కించడానికి పిఎఫ్‌సిఇ ఉపయోగపడుతుంది.

దేశంలో వినియోగ వ్యయం కోవిడ్ కాలంలో పడిపోయింది. 2021-22లో అది మళ్లీ గాడిన పడింది. గత సంవత్సరం నుండి వినియోగ వ్యయం దారుణంగా తగ్గింది. గత సంవత్సరం అక్టోబర్ - డిసెంబర్ మధ్య ఇది మిగతా 5లో

# తుపాను నష్టంపై రాష్ట్రం మాటలు... కేంద్రం మౌనం

- సిఎం జగన్ పంటల నష్టాన్ని పరిశీలించిన తీరు ప్రపంచ రికార్డే!
- తుపాను నష్టానికి కేంద్రం రూ.10 వేల కోట్లు ఇవ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం నిర్వహించాలి
- రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్‌పై బిజెపిది మోసకారితనం : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుపానుతో రైతులు, ప్రజానీకం ఊహించని కష్టాల్లో పడ్డారని, సాయంపై రాష్ట్ర ప్రభుత్వం అమలు కాని మాటలు చెబుతుంటే, కేంద్రం అసలు మాట్లాడడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం విశాఖలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా, గోదావరి డెల్టాల్లో ఓ వైపు వర్షాభావ పరిస్థితులతో 440 మండలాల్లో పంటలు ఎండిపోయిన స్థితిలో ఈ తుపాను వచ్చి కాసింత పండిన పంటలనూ ఊడ్చేసిందని తెలిపారు. తాడేపల్లి ప్యాలస్ నుంచి సిఎం జగన్ సమీక్షలు, ఆదేశాలు చేస్తే పని జరుగుతుందా? అని ప్రశ్నించారు. సిఎం జగన్ కనీసం పొలంలోకి దిగకుండా,



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో లోకనాథం, జగ్గునాయుడు

రైతులతో మాట్లాడకుండా అధికారులు వేసిన స్టేజీపై కూర్చొని నష్టపోయిన పంటలను పరిశీలించారని, ఆయన నష్టాన్ని పరిశీలించిన తీరు ప్రపంచ రికార్డు సృష్టించిందని శ్రీనివాసరావు అన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వ్యవహారం అధ్వానంగా ఉందని తెలిపారు. తాను స్వయంగా బాపట్ల ప్రాంతంలో పరిశీలించగా, రూ.1700 ధర రావాల్సిన రైతులకు రూ.800 ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారని వివరించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే రూ.200 అదనంగా బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని, దీనివల్ల ప్రభుత్వ బియ్యం సేకరణపైనా భారం ఉండదని అన్నారు. దేశం మొత్తమ్మీద ఐదు రాష్ట్రాలను ఈ తుపాను అతలాకుతలం చేసిందని, ఆ రాష్ట్రాల్లో 75 శాతం నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం అడ్వాన్స్ కింద మంజూరు చేయాల్సి ఉన్నా ఒక్క రూపాయీ ఇంతవరకూ ఇవ్వలేదని తెలిపారు. మన రాష్ట్రానికి తక్షణమే రూ.10 వేల కోట్లు సాయం కేంద్రం అందించాలని, దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అఖిలపక్షం వేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని పసిగట్టడంలో కెసిఆర్ విఫలమయ్యారని, ఆ విషయాన్ని జగన్ గుర్తెరగాలని అన్నారు. ఎపిలోనూ అదే తప్పులు జగన్ చేస్తున్నారని తెలిపారు. కెసిఆర్ ఓటమి తరువాత జగన్ సొంత పత్రికలో వచ్చిన సంపాదకీయాన్ని చదివైనా పనితీరు మార్చుకుని ప్రజల ముందుకు వెళ్లాలని హితవు పలికారు.

**బిజెపివి మోసపూరిత వ్యాఖ్యలు**

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగిపోయిందంటూ బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు మోసకారి మాటలు చెబుతున్నారని వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే జోన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇవ్వడం లేదంటూ పార్లమెంట్‌లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన వ్యాఖ్యలు మోసకారితనంతో కూడినవని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తోన్న బిజెపి నేతలకు ఇక్కడ అడుగుపెట్టే అర్హత లేదన్నారు. రైల్వే జోన్ పనులకు భూమి లేకపోతే పని ప్రారంభించరా? అని ప్రశ్నించారు. మోడీ మాటల పట్ల యువత విసిగిపోవడం వల్లే బిజెపిని తెలంగాణలో ఊడ్చి ఎత్తిపోశారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపించానంటూ విశాఖలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కార్మిక పోరాటం వల్ల ఆగిందని తెలిపారు. పవన్ చెప్పిందే నిజమైతే పార్లమెంట్ సమావేశాల్లో ఎందుకు ఆ ప్రకటన చేయించలేదని ప్రశ్నించారు. ప్రజలు, కార్మికులు పోరాడి ప్రయివేటీకరణ ఆపితే ఈ క్రెడిట్‌ను అమిత్ షాకు ఆపాదించే రాజకీయ కుట్రకు పవన్ పాల్పడుతున్నారని విమర్శించారు. సిపిఎం స్వతంత్ర బలాన్ని పెంచుకునే క్రమంలో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పోరాటాలతో ముందుకు సాగుతోందని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు శ్రీనివాసరావు సమాధానమిచ్చారు.

## రైతులపై కేసులు ఎత్తివేయాలంటూ నేడు కలెక్టర్లకు వినతులు

- ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా వారిపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం వాటిని అమలు చేయకపోవడంపై ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు వై కేశవరావు, కెవివి ప్రసాద్, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, పి జమలయ్య, కుర్రా నరేంద్ర, ఎం వెంకటరెడ్డి, కె ప్రసాద్, యు వీరబాబు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ దాసరి భవన్‌లో సీనియర్ రైతు నాయకులు వై కేశవరావు అధ్యక్షతన సమన్వయ సమావేశం ఆదివారం జరిగింది. యుద్వీర్ సింగ్ వంటి నాయకుల నిర్బంధాన్ని ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలన్నారు. కొత్తగా 86 మంది నాయకులపై కేసులను రిజిస్టర్ చేస్తోందని, ఇది అప్రజాస్వామిక చర్య అని, దేశంలోని అన్ని పక్షాలూ ఖండించాలని అన్నారు.

## అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : ఈ నెల 12 నుంచి రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టే నిరవధిక సమ్మెకు తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ మద్దతు ఇస్తున్నట్లు తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఆచంట సునీత తెలిపారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యాయపరమైన హక్కుల కోసం అంగన్‌వాడీల పోరాటంలో అర్థముందన్నారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు.

## 'ఇంటింటికీ కుళాయి' నెరవేరేదెన్నడు?

- సర్వే దశలోనే చాలా గ్రామాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించాలనే లక్ష్యం గడువులోగా కార్యరూపం దాల్చుతుందా? లేదా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. 2024కు లక్ష్యం పూర్తి చేసి నూటికి నూరు శాతం గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి కుళాయిల ద్వారా నీరు అందించాలని కేంద్రం లక్ష్యంగా ప్రకటించినప్పటికీ, ఆచరణలో ఈ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2023 డిసెంబరు నెల సగం పూర్తవుతున్నప్పటికీ నేటికీ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే జరుగుతోందంటే ఈ పథకం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యత ఏ మేర ఉందో అర్థమవుతోంది. సర్వేకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసే వలంటీర్లకు ప్రభుత్వం సర్వే ఎలా చేయాలి? ఇంటి యజమానిని ఏయే ప్రశ్నలు అడగాలి? అనే అంశంపై ప్రభుత్వం కొన్ని ప్రశ్నలను వలంటీర్లు నమోదు చేయాల్సిన యాప్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉద్దానం, ఎన్‌టిఆర్ జిల్లాలో ఎ కొండూరు, ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలం నేరుడుపల్లి, మురుగమ్మి వంటి గ్రామాల్లో నేటికీ స్వచ్ఛమైన నీరు లేక ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడే వారు అనేక మంది ఉన్నారు. ఆయా గ్రామాల్లో కిడ్నీ వ్యాధుల బారినపడి డయాలసిస్ చేసుకునే వారి సంఖ్య కూడా అధికంగానే ఉన్నది. అత్యంత ప్రాధాన్యత కలిగిన మంచినీటి సమస్యను పరిష్కరించే క్రమంలో కొత్త కుళాయి కనెక్షన్లు ఇవ్వాలనే సర్వే దశ దాటకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు వేగవంతంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కాలుష్యరహిత పరిశ్రమలు తీసుకొస్తాం

- యువగళం పాదయాత్రలో నారా లోకేశ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అధికారంలోకి వచ్చిన వెంటనే కాకినాడ సెజ్‌లో పరిశ్రమలను తీసుకొచ్చి స్థానికంగా భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్ర 218వ రోజుకు చేరింది. ఆదివారం కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని శృంగవక్షం నుంచి ప్రారంభమైన పాదయాత్ర తేటగుంట వరకు సాగింది. శృంగవృక్షంలో సెజ్ రైతులతో లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిడిపి హయాంలో అనేక పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. ఒక్క కియా కంపెనీ రావడంతోనే అనంతపురంలో ప్రజల స్థితిగతులు మారాయని, వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు వచ్చాయని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే


ఒంటిమామిడి గ్రామంలో నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న లోకేష్

కాలుష్యరహిత కంపెనీలు తీసుకొచ్చి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, సెజ్ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తొం డంగిలో మత్స్యకారులు లోకేష్‌ను కలిశారు. పార్మసీ కంపెనీల వ్యర్థాల వల్ల మత్స్య సంపద నశించిపో తోందని వారు ఆయనకు వివరించారు. లోకేష్ స్పందిస్తూ వైసిపి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. మత్స్యసంపద నష్టపోకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఒంటిమామిడి వద్ద నీట మునిగిన వరి పంటను పరిశీలించి రైతులు, కౌలు రైతులతో మాట్లాడారు. తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకూ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పోరాటం ద్వారానే పరిష్కారమవుతాయని, ఆత్మహత్యలకు కాదని యుటిఎఫ్ తెలిపింది. అనంతపురం జిల్లా ఉపాధ్యాయుడు మల్లేష్ ఆత్మహత్యాయత్నం పట్ల ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో మనోవేదన కలిగితే తప్ప ఆత్మహత్య ప్రయత్నం చేసుకోరని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించిన విధానాలను, ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాతినిధ్యం ద్వారా సమస్యలు పరిష్కారం కాకపోతే రెట్టింపు ఉత్సాహంతో మరింత కసితో పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. జీతాలు ఒకటినే చెల్లించాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. మల్లేష్ ఆత్మహత్యాయత్నం ద్వారా నైనా ఉద్యోగుల్లో ఉన్న ఆవేదనను సిఎం గ్రహించాలని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి మరో ప్రకటనలో తెలిపారు.

## ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన దత్ మాస్టారు

- ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అమరావతి ( పల్నాడు జిల్లా)

ఉపాధ్యాయ సమస్యలపై తుదిశ్వాస వరకు పోరాటాలు నిర్వహించారని, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి దత్ మాస్టారు అని ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వర్లు (ఐవి) అన్నారు. పల్నాడు జిల్లా అమరావతిలోని శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌లో ఆ పాఠశాల పూర్వ హెచ్‌ఎం, యుటిఎఫ్ నేత ముదునూరు అక్షయ్ కుమార్ దత్ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ముందుగా దత్ మాస్టారు చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళు లర్పించారు.

అనంతరం జరిగిన సభలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత దత్ మాస్టార్‌కు దక్కిందని తెలిపారు. శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయునిగా, పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ఎంతోమంది



సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, వేదికపైన ఐవి తదితరులు

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో కీలక నాయకుడిగా వ్యవహరించారని తెలిపారు. ఐ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రాల్లో యుటిఎఫ్ ఉద్యమ నిర్మాణంలోనూ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలోనూ దత్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు కొల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దత్ మాస్టారు శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థులను చైతన్యవంతులను చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, యుటిఎఫ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షులు కె జోజయ్య, సిహెచ్ బోస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జి. కోటేశ్వరరావు, వావిలాల సుబ్బారావు, దత్ మాస్టారు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


విఆర్‌ఎల విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు

## పే స్కేల్ అమలు చేయాలి

- ఎపి విఆర్‌ఎల సంఘం డిమాండ్

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

తెలంగాణలో అమలవుతున్న విధంగా పే స్కేల్ అమలు చేయాలని, డిఎ బకాయిల కోసం దశలవారీ ఆందోళనలు, పోరాటాలు చేయాలని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సంఘం ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన విఆర్‌ఎల విస్తృత సమావేశంలో డిఎ బకాయిలతోపాటు తెలంగాణలో అమలవుతున్న విధంగా పే స్కేల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, బిఎల్‌ఓ విధుల్లోంచి విఆర్‌ఎలను మినహాయించాలని, ఇంటర్మీడియట్ మీదనే ఉద్యోగోన్నతి కల్పించాలని తదితర డిమాండ్లపై ఈ నెల 14న జరగనున్న కేబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు-పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఈ నెల 12, 13 తేదీల్లో మంత్రులు, అధికారులకు సామూహిక రాయబారాలు, ఈ నెల 21న తహశీల్దార్లకు వినతిపత్రాలు, 28న కలెక్టరేట్ల వద్ద దీక్షలు, జనవరి 5న సిసిఎల్ఎ ఆఫీసు వద్ద మహాధర్నాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించింది. ఈ సందర్భంగా కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. విఆర్‌ఎలకు గత ఐదేళ్లుగా వేతనాలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేవలం రూ.10,500 మాత్రమే విఆర్ఎకు ఇస్తున్నారన్నారు. సంఘం రాష్ట్ర నాయకులు టి అంజి, బదంగీ సాహెబ్, త్రినాథరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విఆర్‌ఎలతో భూ సర్వే, బిఎల్‌ఓ వంటి అదనపు పనులు అప్పగించి గొడ్డుచాకిరీ చేయిస్తుదన్నారు.

**విఆర్ఎ సంఘం నుంచి పెద్దన్న, బాలకాశి బహిష్కరణ**

ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నియమ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ.. దుష్ప్రచారం చేస్తూ సంఘ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ పెద్దన్న, ఎం బాలకాశిని సంఘం నుండి బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర విస్తృత సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

**నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక**

విఆర్ఎ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షులుగా టి అంజి, ప్రధాన కార్యదర్శిగా కె ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా వడ్డే బాజీబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా షేక్ బందగీ సాహెబ్, సుబ్బన్న, ఉపాధ్యక్షులుగా త్రినాథరావు, బ్రహ్మాజీ, పి సుబ్బారావు, కొండబాబు, జాయింట్ సెక్రటరీలుగా రవికుమార్, నాగేష్, వెంకన్న, మొగిలి, నాగేంద్ర, కార్యవర్గ సభ్యులుగా అన్ని జిల్లాల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కెసిఆర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో



మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కె చంద్రశేఖరరావును యశోద ఆస్పత్రిలో ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. కెసిఆర్ ఆరోగ్య పరిస్థితిపై మాజీ మంత్రి కెటిఆర్‌ను అడిగి తెలుసుకున్నారు. కెసిఆర్ భార్య శోభకు ధైర్యం చెప్పారు. ఈ నెల 7వ తేదీన కెసిఆర్ బాత్‌రూంలో కాలుజారి పడడంతో తుంటి మార్పిడి శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డి సహచర మంత్రి అనసూయ సీతక్క, మాజీ మంత్రి షబ్బీర్ అలీతో కలిసి యశోదా ఆస్పత్రికి వెళ్లి మాజీ సిఎం కెసిఆర్‌ను పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లి కెసిఆర్‌ను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో సిఎం మీడియాతో మాట్లాడారు. కెసిఆర్ త్వరగా కోలుకొని, అసెంబ్లీకి వచ్చి, ప్రజాసమస్యలపై మాట్లాడాలని కోరారు. వైద్యులతో చర్చించినప్పుడు ఆయన త్వరగా కోలుకుంటున్నారని చెప్పారని, ఆయన ఆరోగ్యంపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించామన్నారు. మెరుగైన ప్రభుత్వ పాలనకు ఆయన సూచనలు అవసరమని రేవంత్ చెప్పారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా కెసిఆర్‌ను పరామర్శించేందుకు వెళ్లగా ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారని చెప్పడంతో కెటిఆర్‌తో మాట్లాడారు.

## 'ఆడుదాం ఆంధ్రా'కు ఆటస్థలాలేవీ?

(మొదటిపేజీ తరువాయి)

తరువాత మండల, నియోజకవర్గ స్థాయిలో ఆడించేందుకు విద్యాసంస్థల స్థలాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది.

**జిల్లా కేంద్రాల్లోనూ కొరతే..**

ఆటస్థలాల కొరత జిల్లా కేంద్రాల్లోనూ వెంటాడుతోంది. ఉన్నవి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోవడం లేదు. గతంలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం, గుంటూరులో బ్రహ్మానంద రెడ్డి స్టేడియాల్లో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. ఇప్పుడు వీటి నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసింది. ఇందిరా గాంధీ స్టేడియాన్ని రాజకీయ, ప్రచార సభలకే ఉపయోగిస్తున్నారు. ఇటీవల కోట్ల రూపాయలతో స్టేడియంలో యజ్ఞం చేయించిన రాష్ట్ర ప్రభుత్వానికి దీనిని అభివృద్ధి చేయాలనే ఆలోచన రాలేదు. చిన్నపాటి వర్షం వస్తే రోజుల తరబడి నీరు ఉండటంతో బ్రహ్మానంద స్టేడియం వైపు క్రీడాకారులు వెళ్లడం లేదు. జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ, మున్సిపల్ పరిధిలో ఉన్న వాటిల్లో క్రీడా వికాస కేంద్రాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. వీటి నిర్వహణను ప్రైవేట్‌కు అప్పగించి, క్రీడాకారుల నుంచి డబ్బులు వసూలు చేసుకోవాలని సలహా ఇచ్చింది. కొంత ఆర్థిక స్తోమత ఉన్న క్రీడాకారులు డబ్బులు చెల్లించి ఆడుతున్నారు. పేదలు మాత్రం డబ్బులు చెల్లించలేక ఆటలకు దూరమవుతున్నారు.

**ఒక పక్క ఆట.. మరో పక్క పాఠం**

శాప్ క్రికెట్‌కు గుర్తించిన స్థలాల్లో సుమారు ఐదు వేలకు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉన్నవే ఉన్నాయి. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు వరుసగా మ్యాచ్‌లు జరగనున్నాయి. దీంతో ఒక పక్క విద్యార్థులు పాఠాలు వింటుంటే, మరోపక్క సచివాలయ సిబ్బంది ఆటలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ గందరగోళం మధ్యలో విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంటుంది.

**50 రోజుల్లో 3 లక్షల మ్యాచ్‌లు సాధ్యమేనా?**

గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 2.99 లక్షల మ్యాచ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఇన్ని మ్యాచ్‌లను 50 రోజుల్లోనే నిర్వహించడం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్న క్రీడాకారుల్లో నెలకొంది. ఈ నెల 15 నుంచి 15,004 గ్రామ, వార్డుల్లో 6 రోజుల్లో 1.5 లక్షల మ్యాచ్‌లను నిర్వహించాల్సి ఉంది. వీటిల్లో గెలుపొందిన జట్లకు మండల స్థాయిలో 15 రోజుల్లో 1.42 లక్షల మ్యాచ్‌లను 680 మండలాల్లో నిర్వహించాలి. మండల స్థాయిలో గెలుపొందిన జట్లకు ఆరు రోజుల్లో 175 నియోజకవర్గాల్లో 5,250 మ్యాచ్‌లను జరపాలి. జిల్లా స్థాయికి అర్హత సాధించిన జట్లకు 10 రోజుల్లో 26 జిల్లాల్లో 312 మ్యాచ్‌లు నిర్వహించాలి. రాష్ట్రస్థాయికి వచ్చిన జట్లకు 250 మ్యాచ్‌లను 6 రోజుల్లో నిర్వహించాలి.

**వలంటీర్లే అంపైర్లు!**

ఎంపిక చేసిన ఆటల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం వలంటీర్లకు అప్పగించింది. కేవలం 10 రోజులు ఆన్‌లైన్ శిక్షణ వీరికి ఇచ్చి తూతూ మంత్రంగా నిర్వహిస్తుందనే అభిప్రాయం క్రీడాకారుల్లో నెలకొంది. వీరితోనే గ్రామ, మండల, నియోజకవర్గాల స్థాయి వరకు నిర్వహించనుంది. రాష్ట్రంలో యుజిడి, ఎంపిఇడి, బిపిఇడి వంటి వ్యాయామ విద్య అభ్యసించిన నిరుద్యోగులు లక్షల మంది ఉన్నారు. శాప్‌లో సుమారు వెయ్యి కోచ్ పోస్టులకు కేవలం 150 మంది మాత్రమే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. ఇవి కాకుండా ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వేల పిఇటి పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు.

**17.10 లక్షల క్రీడా దుస్తులు**

గ్రామ స్థాయిల్లో గెలుపొందిన జట్లకు క్రీడా దుస్తులను అందజేస్తారు. బ్యాడ్మింటన్ జట్టుకు రెండు, క్రికెట్‌కు 16, ఖోఖోకు 15, కబడ్డీకి 15, వాలీబాల్‌కు 12 చొప్పున గెలుపొందిన పురుషులు, మహిళా జట్లకు 114 డ్రెస్సులు అందిస్తారు. 15,004 సచివాలయాల్లో 114 చొప్పున 17,10,456 డ్రెస్సులను ప్రభుత్వం అందించనుంది. గ్రామస్థాయిలో ఇచ్చిన దుస్తులతో జిల్లా స్థాయి వరకు ఆడతారు. జిల్లా స్థాయిలోకి వచ్చిన జట్లకు పూర్తిస్థాయి దుస్తులు అందజేస్తారు.

## రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఉద్యమిద్దాం

- పలువురు వక్తల పిలుపు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

వెనుకబాటు తనానికి మారుపేరుగా నిలిచిన రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాయలసీమ అభివృద్ధి - సమస్యలపై జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం చర్చాగోష్టి జరిగింది. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన చట్టం హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడంతో రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ అమలు చేయకపోవడం, కడప స్టీల్ ఫ్యాక్టరీని పొందలేకపోవడం, హైకోర్టును సాధించుకోలేకపోవడం, నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసుకోలేకపోవడం వలన రాయలసీమ అభివృద్ధి చెందలేకపోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల మోటారు బావులుండగా ఒక్క రాయలసీమలోనే 12 లక్షల మోటార్ బావులు ఉన్నాయని, వీటన్నింటికీ స్మార్ట్ మీటర్లు పెడితే రాయలసీమ రైతులకు అవి ఉరితాళ్ళుగా మారుతాయని తెలిపారు. రాయలసీమ సమగ్ర అభివద్ధి ప్రణాళికను రూపొందించి వాటి అమలుకు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా కషి



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

జరగాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ ఎన్.తులసీరెడ్డి మాట్లాడుతూ.. రాజధానిని విశాఖకు తరలిస్తే ఎక్కువగా నష్టపోయేది రాయలసీమ ప్రజలే అన్నారు. హంద్రీనీవా సృజల స్రవంతి, గాలేరు-నగరి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికి నీటిసమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిరాసక్తత ఫలితంగా రాయలసీమ కరువు ప్రాంతంగా మారిందన్నారు. ప్రభుత్వం ఉత్పాదక రంగాలకు నిధులు వెచ్చించకుండా.. అనుత్పాదక రంగాలకు వ్యయం చేస్తోందని, అభివృద్ధిపై దృష్టి పెట్టడంలేదని, అప్పులు చేసి ప్రజలను యాచకులుగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమకు నీరు, నిధులు, నియామకాలు జరగాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సీనియర్ నేత జి.ఓబులేష్ ప్రసంగిస్తూ వరదకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టుకు రూ.10 కోట్లు వెచ్చించలేకపోవడం వలన గత మూడేళ్లుగా ప్రాజెక్టు పునర్నిర్మాణం జరగలేదని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో నీటిపారుదల ప్రాజెక్టుల కోసం టిడిపి ప్రభుత్వం చేసిన వ్యయంలో నాలుగో వంతు కూడా వైసిపి ప్రభుత్వం చేయలేకపోయిందని విమర్శించారు. చర్చాగోష్టిలో టిడిపి నాయకులు జి.నరసింహ యాదవ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సిపిఐ నేతలు రాధాకష్ణ, పెంచలయ్య, కాంగ్రెస్ నాయకులు నవీన్ కుమార్‌రెడ్డి, జనసేన నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినీనటి సుధను సన్మానిస్తున్న అయోధ్యరామిరెడ్డి తదితరులు

## కళాకారులను ఆదరించండి

- ఎంపి ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- సినీనటి సుధకు ఘంటసాల ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కళాకారులను ఆదరించడం ద్వారా సమాజంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేయాలని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. కళాదర్బార్, అయోధ్య రామిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకులు ఘంటశాల వెంకటేశ్వరరావు, ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారక ప్రతిభా పురస్కారాల ప్రదానం గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగింది. ఈ పురస్కారాలను సినీనటి సుధకు ఎంపి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ.. రామ్‌కీ ఫౌండేషన్ స్థాపించి దేశ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, తన తండ్రి దశరథరామిరెడ్డి సేవా కార్యక్రమాలతోపాటు కళాకారులను ఆదరించారని తెలిపారు. తమ ఫౌండేషన్‌తోపాటు కళాదర్బార్ ఆధ్వర్యంలో ఆలనాటి గాయకుడు ఘంటశాల పేరిట కళాకారులను సన్మానించడం ముదావహమని అన్నారు. సినీనటి సుధ అనేక చిత్రాల్లో ఉత్తమ నటిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. కుటుంబ కథాచిత్రాల్లో ఆమె బాగా రాణించారని చెప్పారు. కళాదర్బార్ అధ్యక్షులు పొత్తూరి రంగారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆనాటి నటీనటులు, గాయకుల గొప్పతనాన్ని తెలియజేయడం కోసం నేటి తరం కళాకారులను సన్మానిస్తున్నామని తెలిపారు. ఘంటసాల గానామృతం పేరుతో సంగీత విభావరి నిర్వహించారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదరి కె ధనలక్ష్మి, నాయకులు

## 14, 15 తేదీల్లో ఆశాల ధర్నా

- పోస్టరు ఆవిష్కరణ

ప్రజావక్తి-అమరావతి బ్యూరో

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14, 15 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నా, వంటా-వార్పు చేపట్టనున్నట్లు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, ఎన్‌హెచ్‌ఎంకు సంబంధం లేని పనులు చేయించరాదని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ ఇవ్వాలని అన్నారు. ఏ కారణంతో చనిపోయినా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, అధికారుల బెదిరింపులు తొలగించాలని అన్నారు. రిటైర్మెంటు అయిన ఆశాలకు రూ.ఐదు లక్షలు చొప్పున ఇవ్వాలన్నారు. పెన్షన్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఎఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశా వర్కర్లకు పర్మిమెంటు పోస్టుల భర్తీ సందర్భంగా వెయిటేజీ మార్కులు ఇవ్వాలన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం కమల, శ్రీలక్ష్మి, పి పద్మావతి, ఎస్ పద్మ, ఆర్ శివమ్మ, ఎం శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆరోగ్యశ్రీ' సిఇఒగా జెసి బాలాజీ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒగా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో జెసిగా ఆయన ఆదివారం బాధ్యతల నుండి రిలీవ్ అయ్యారు. తదుపరి రెగ్యులర్ జెసి నియమించే వరకు డిఆర్ఒ పెంచల కిషోర్ ఇన్‌ఛార్జి జెసిగా కొనసాగనున్నారు.

## కౌలు రైతు ఆత్మహత్య


నీలకంఠారెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-గార్లదిన్నె

అప్పుల బాధతాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన రైతు నీలకంఠారెడ్డి (35) గతకొన్నేళ్లుగా రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ, కూరగాయల పంటలు సాగు చేశారు. ఇందు కోసం దాదాపు రూ.8 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో పంటలు చేతికందలేదు. పెట్టుబడులు కూడా రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అప్పులు తీర్చలేనన్న ఆందోళనతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. నీలకంఠారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఒపిఎస్ అమలు చేయలేదని ఉపాధ్యాయుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ఉరవకొండ (అనంతపురం జిల్లా)

ఒపిఎస్ అమలు చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేకపోవడంతో, మనోవేదనకు గురై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన అనంతరంపురం జిల్లా ఉరవకొండ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నముష్టూరు గ్రామానికి చెందిన బోయ మల్లేష్ విడపనకల్లు మండలం పాల్తూరు ఇందిరానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయుల పట్ల ముఖ్యమంత్రి అనుసరిస్తోన్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం ఉదయం ఐదు పేజీల లేఖను ప్రభుత్వానికి రాశారు. సిపిఎస్ రద్దు చేయలేదని, సక్రమంగా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వడంలేదనే సారాంశంతో లేఖను రాసి దానిని సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. 'సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో సకాలంలో ఇఎంఐ చెల్లించలేక అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాను. నేను వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి వీరాభిమానిని. ఆయన తనయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాడన్న నమ్మకంతో నాతో పాటు తోటి మిత్రులు, బంధువులతో జగన్‌మోహన్‌రెడ్డికి ఓట్లు వేయించాను. అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులను నిలువునా మోసం చేశారు. పిఆర్‌సి, డిఎలు ఇవ్వకపోవడం బాధ కలిగించింది. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా. నేను చనిపోయిన తర్వాత నాకు రావాల్సిన డిఎ, అరియర్స్ సకాలంలో అందిస్తారని కోరుకుంటున్నా' అని లేఖలో పేర్కొన్నారు. అనంతరం పెన్నఅహోబిలం వద్ద పురుగుల మందు తాగారు. బంధువులు ఆయనను అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

## సిఎం సరికొత్త నాటకం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో యువత ఓట్ల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త నాటకానికి తెరతీశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు కేవలం మూడు నెలల గడువు మాత్రమే మిగిలి ఉండగా గ్రూప్-1, 2 నోటిఫికేషన్ విడుదల పేరుతో సరికొత్త నాటకానికి తెరదీశారని పేర్కొన్నారు. తాను అధికారంలోకి వస్తే ప్రతియేటా జనవరిలో జాబ్ కేలండరు విడుదల చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి మడమ తిప్పారని విమర్శించారు. నిరుద్యోగ యువతకు గత నాలుగున్నరేళ్లుగా ద్రోహం చేసిన జగన్‌కు యువత బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందన్నారు.

## ఐక్య పోరాటాలతో 'తపాలా'ను కాపాడుకోవాలి

- ఎన్ఎఫ్‌పిఇ గుర్తింపు తొలగింపు అన్యాయం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. ఐక్య పోరాటాలతో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రెండ్రోజులు నిర్వహించనున్న అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్-సి, (ఎన్ఎఫ్‌పిఇ) 40వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభ ప్రకాశం జిల్లా మార్కాపురంలోని మాధవి గ్రాండ్ ఇన్‌ఫంక్షన్ హాల్‌లో ఇ శంకరనాయుడు అధ్యక్షతన ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ నేటికీ మారుమూల ప్రాంతాలకు సైతం సేవలు అందిస్తున్న తపాలా శాఖను కేంద్రం ప్రయివేటీకరించాలనుకుంటోందన్నారు. ప్రయివేటీకరణ ఆలోచనను గతంలో ఎన్ఎఫ్‌పిఇ పోరాటాలతో అడ్డుకుందని గుర్తుచేశారు. మళ్లీ అదే ప్రయత్నంలో ప్రధాని మోడీ ఉన్నారని తెలిపారు. తపాలా శాఖ ప్రయివేటీకరణను ప్రజా ఉద్యమంతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం తపాలా శాఖలో రూ. ఐదు లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలే ఎక్కువగా దాచుకుంటారని తెలిపారు. తపాలా శాఖ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రయివేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని విమర్శించారు. జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ తపాలా శాఖలో తమతో ఏదైనా సమస్య తీరుతుందనుకుంటే సహకరిస్తామన్నారు. అనంతరం ఎన్ఎఫ్‌పిఇ ప్రతినిధులు, నాయకులు, తపాలా ఉద్యోగులు వందలాదిగా మార్కాపురం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్-సి కేంద్ర సంఘం నాయకులు శ్రావణ్ కుమార్, ఆర్ఎన్ శరత్‌కుమార్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్టుమేన్ అండ్ ఎంటిఎస్ కేంద్ర సంఘ కార్యదర్శి సిహెచ్ విద్యాసాగర్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం-జిడిఎస్ కేంద్ర సంఘ సహాయ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, తెలంగాణా రాష్ట్ర గ్రూప్-సి అధ్యక్షులు మహిందర్, పోస్టుమేన్ అండ్ ఎంటిఎస్ రాష్ట్ర సంఘ అధ్యక్షులు మురళీ, పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ కేంద్ర, రాష్ట్ర సంఘ నాయకులు డి మోహనరావు, కె వెంకటేశ్వర్లు, ఎన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


విస్తరణ పనులకు భూమి పూజ చేస్తున్న కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

## విమానాశ్రయాలను పెంచాం

- వెయ్యేళ్ల చరిత్ర గల రాజమహేంద్రవరం దేశానికే తలమానికం
- టెర్మినల్ భవన నిర్మాణ శంకుస్థాపనలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

దేశంలో విమానయాన రంగాన్ని వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే మధురపూడి ఎయిర్‌పోర్టులో రూ.347 కోట్లతో టెర్మినల్ భవనం విస్తరణకు శ్రీకారం చుట్టామని కేంద్ర విమానయాన, ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. మధురపూడి విమానాశ్రయంలో టెర్మినల్ భవన విస్తరణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెయ్యేళ్ల ఉత్సవాలు చేసుకుంటున్న రాజమహేంద్రవరం నగర సాంస్కృతిక వారసత్వం దేశానికే తలమానికమన్నారు. 2014 నాటికి దేశంలో 74 ఎయిర్ పోర్టులు ఉండగా, ఈ తొమ్మిదిన్నరేళ్లలో కొత్తగా మరో 75 ఎయిర్ పోర్టులు వచ్చాయన్నారు. దీంతో దేశంలో ఎయిర్ పోర్టుల సంఖ్య 149కి చేరిందని తెలిపారు. రానున్న కాలంలో వీటి సంఖ్య 220కి పెంచుతామన్నారు. ప్రస్తుతం మధురపూడిలో నిర్మిస్తున్న కొత్త టెర్మినల్ పాయింట్ 21.94 వేల చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉంటుందన్నారు. రద్దీ వేళల్లో 2,100 మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. ఎయిర్‌పోర్టులో ప్రస్తుతం 18 సర్వీసులు నడుపుతున్నామని, రానున్న రోజుల్లో 25 వరకు సర్వీసులను పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపి మార్గాని భరత్‌రామ్, ఎంఎల్ఎలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంజీవ్ కుమార్, కలెక్టర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విపత్తుగా 'మిచౌంగ్'

- ప్రధాన మంత్రికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మిచౌంగ్ తుపాను వల్ల రాష్ట్రంలో తీవ్ర నష్టం జరిగిందని, దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఆదివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో 15 జిల్లాల్లో తుపాను తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. 100 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు ప్రజల జీవనాన్ని దెబ్బతీశాయని, ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 22 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలుస్తోందని తెలిపారు.

పంట నష్టపోయిన ఆవేదనతో నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.10 వేలకోట్ల వరకు పంట నష్టం ఉంటుందని అంచనా వేశారు. పంటలతోపాటు పలుచోట్ల పశువులు చనిపోయాయని, చెట్లు విరిగిపడ్డాయని, దాదాపు 770 కిలోమీటర్ల మేర రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. తాగునీరు, నీటిపారుదల, విద్యుత్, కమ్యూనికేషన్ రంగాలకు నష్టం జరిగిందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఆక్వా రంగం కూడా నష్టపోయిందని పేర్కొన్నారు. పడవలు, వలలకు నష్టం జరగడంతో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారని వివరించారు. నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక బృందాన్ని పంపాలని కోరారు. జాతీయ విపత్తుగా ప్రకటిస్తే తక్షణ, మెరుగైన సహాయం బాధితులకు అందుతుందని అన్నారు.

### చేతల్లో మానవత్వం చూపండి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటల్లో కాకుండా చేతల్లో కొంచెం మానవత్వం చూపాలని చంద్రబాబు కోరారు. అనంతపురం జిల్లాలో ప్రభుత్వం పెన్షన్ నిలిపివేయడంతో గిరిజన మహిళ ఆత్మహత్యకు పాల్పడిందని ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. ఆంక్షల పేరుతో అంధురాలి పెన్షన్ తొలగింపు కర్కశత్వం అని అన్నారు.

## నూతన విద్యా విధానంతో పేదలకు విద్య దూరం

- సమాజ మార్పులో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలి
- యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పిడిఎఫ్ పూర్వ ఫ్లోర్ లీడర్ బాలసుబ్రమణ్యం
- డిఎస్‌సి వెంటనే ప్రకటించాలని తీర్మానం


యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అమలు చేస్తూ పేదలకు విద్యను దూరం చేస్తోందని పిడిఎఫ్ పూర్వ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. సమాజ మార్పులో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఏలూరులోని చలసాని గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం చివరి రోజు ఆదివారం ప్రతినిధుల సభ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ శాస్త్రీయ విద్యనందించే దిశగా మంచి బడికి పునాదులు వేయాలన్నారు. కేరళ తరహాలో మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అందరికీ ఉచిత నాణ్యమైన విద్య అందించాలని కోరారు. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయాలని, కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వ జోక్యం పెరగాలని, వాటిని నియంత్రించాలని అన్నారు. నూతన విద్యావిధానం పేరుతో కేంద్రం నుండి వచ్చిన పాఠ్య పుస్తకాలనే బోధించడం తగదన్నారు. ఈ పాఠాలు వాస్తవ చరిత్రను కప్పిపుచ్చి అవాస్తవాలు విద్యార్థుల మెదడులో చొప్పిస్తున్నాయని పేర్కొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల వల్ల ఉపాధ్యాయ, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. మంచి పిఆర్‌సి ఇస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, డిఎ బకాయిలు లేకుండా చెల్లిస్తామని ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. పాత పెన్షన్ పునరుద్ధరించకపోగా మరింత ప్రమాదకరంగా జిపిఎస్ తీసుకొచ్చారన్నారు. వీటిని ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కార్యాచరణ రూపొందించి భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. సంఘం కోశాధికారి బి.గోపీమూర్తి ఆర్థిక వేదికను, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎం.కుమార్‌రాజా పత్రిక నివేదికను, ఆడిట్ కన్వీనర్ మల్లేశ్వరరావు ఆడిట్ నివేదికను, ప్రచురణ కమిటీ చైర్మన్ హనుమంతరావు ప్రచురణ నివేదికను, సహాధ్యక్షులు ఎ.కుసుమకుమారి మహిళా ఉద్యమ నివేదికను ప్రవేశపెట్టారు.

### పలు తీర్మానాలు ఆమోదం

డిఎస్‌సి వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఐఆర్ ప్రకటించాలని, పాఠశాల స్థాయి పరీక్షా విధానాన్ని సమీక్షించాలని తదితర తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. 26 జిల్లాల నుండి వచ్చిన యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

## సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేసిందనిజనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టులో గేట్లు కొట్టుకుపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని అన్నారు. శ్రీకాకుళంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. ఇసుక, మద్యం, విద్య, పశుసంవర్థక శాఖ ఇలా ఎందులో చూసినా రూ.వేల కోట్ల అవినీతి బయటపడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి బంధువు, మాజీ మంత్రి నెల్లూరు జిల్లాలో పెద్దఎత్తున భూముల లావాదేవీల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్నివిధాలుగా దివాళా తీయించారని ఆరోపించారు. వీటన్నింటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సంక్షేమం పేరిట ప్రజలపై భారాలు మోపుతున్నారని తెలిపారు. నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

## 17న 'మూడు రాజధానుల' పై నిరసన

- నాలుగేళ్లు నిండిన సందర్భంగా వర్సిటీ ఎదుట భారీ సభ
- తుళ్లూరు సమావేశంలో రాజధాని రైతులు వెల్లడి


తుళ్లూరులో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో మూడు రాజధానులు ప్రకటన చేసి డిసెంబర్ 17 నాటికి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు అమరావతి సమన్వయ కమిటీ, అమరావతి జెఎసి నాయకులు తెలిపారు. తుళ్లూరులోని జమ్ముల నరసింహారావు కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2019 అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేసిన రోజునే అమరావతి మహోద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని, ప్రకృతి వైపరీత్యాలను అధిగమించి ఉద్యమాన్ని రాజధాని గ్రామాల్లో నిరాటంగా కొనసాగిస్తున్నామన్నారు. ఈ క్రమంలో యూనివర్సిటీ ఎదుట బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నామని, నాయకులు ధనేకుల రామారావు, పువ్వాడ సుధాకర రావు, బెల్లం కొండ నరసింహారావు తెలిపారు. అన్ని గ్రామాల్లో రైతులు, అసైన్డ్ రైతులు, మహిళలు సభకు భారీగా హాజరు కావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మాట తప్పి మడమ తిప్పి ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసిందని, అమరావతి ఉద్యమకారులపై అక్రమ కేసులు, నిర్బంధాలతో అణచివేత చర్యలకు పాల్పడిందని అన్నారు.

17న జరిగే సభకు టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరవ్వాలని కోరారు. సమావేశంలో రాజధాని ప్రాంతంలోని రైతులు, రైతు కార్మికులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రైతు కవనం సభలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

## మోడీ పాలనలో వ్యవసాయ రంగం పతనం

- రైతు కవనంలో వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని, మోడీని ఓడించకుంటే మరింత పతనం దిశగా వెళ్లే అవకాశం ఉందని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య తెలిపారు. కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఆదివారం సాహితీ స్రవంతి, ఎఐకెఎస్ సంయుక్తంగా రైతుకవనం నిర్వహించారు. సిపిఎం జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప అధ్యక్షతన జరిగిన ఈ సభలో కృష్ణయ్య మాట్లాడుతూ.. మోడీ సంస్కరణల వల్ల వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గి ఉత్పత్తి ఖర్చులు పెరిగాయన్నారు. 85 శాతం రైతులు ఐదెకరాలలోపు వారేనని తెలిపారు. 2014 ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ రైతులకు ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం అదనంగా వచ్చేటట్లు చేస్తానన్నారని, వ్యవసాయ బీమా చేస్తానని హామీ ఇచ్చి రైతులను మోసం చేశారన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు రైతులకు అందుబాటులో లేవని తెలిపారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేవని, వ్యవసాయ రంగం కార్పొరేట్ కంపెనీల మయం కానుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని రైతు సంఘాల ఆధ్వర్యంలో త్వరలో విజయవాడలో రైతు సదస్సు నిర్వహించనున్నామని చెప్పారు. అందరూ ఐక్యమై వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించాల్సిన అవసరముందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ.. వ్యవసాయరంగంపై కేంద్రం పెత్తనమేమిటని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 1990 నుండి ఇప్పటి వరకు 3 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ప్రతి రోజు 28 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకష్ణ మాట్లాడుతూ.. అన్నదాతను కాపాడుకోకపోతే భవిష్యత్తు ఉండదన్నారు. జనకవనంలో సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి అవుల చక్రపాణియాదవ్, కవులు కల్యాణదుర్గం స్వర్ణలత, పార్వతయ్య, సలీం, పులిచేరి మహేష్ పానుగంటి చంద్రయ్య, జంగం స్వయం ప్రభలు కవితలు చదివారు. సమావేశంలో ప్రజానాట్యమండలి నాయకులు బసవరాజు రైతు చైతన్యగీతాలు పాడారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు నాగేష్, ఐలు నాయకులు వెంకటస్వామి, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెయన్ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కమిటీ

- కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విజ్ఞప్తి
- సిఎం దృష్టికి తీసుకెళ్తా : మల్లాది విష్ణు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి అధికారుల కమిటీని నియమించి, నిర్ణీత కాలపరిమితిలోపు పరిష్కరించాలని కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎపి జెఎపి అమరావతి అనుబంధం) ప్రథమ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విజయవాడలోని గాంధీనగర్ జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం ఈ మహాసభ అసోసియేషన్ అధ్యక్షులు కె సుమన్ అధ్యక్షతన జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఆప్కాస్ పేరుతో ఒక రక్షణ వలయాన్ని ఏర్పాటుచేసి, దళారుల వ్యవస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం విముక్తి చేసిందన్నారు. ఉద్యోగులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సిఎంతోపాటు మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలో కనీస సర్వీస్ కటాఫ్ పెట్టి అందరికీ మినిమం టైమ్‌స్కేల్ (ఎంటిఎస్) వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేసి భద్రత కల్పించాలన్నారు. ఈ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు, ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ టివి ఫణి పేర్రాజు, అల్లం సురేష్‌బాబు, ఎపి జెఎసి అమరావతి మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ పి లక్ష్మి, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నరసయ్య, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆర్లయ్యతోపాటు పలు సంఘాల నాయకులు ప్రసంగించారు.

సభ ప్రారంభానికి ముందు కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షులుగా కె సుమన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి గురునాథ్, వైస్ ప్రెసిడెంట్లుగా జి సంపత్, ఎస్‌వి కృష్ణ, జె మెర్సీకుమారి, కెజె రామ్, జనరల్ సెక్రటరీగా అల్లం సురేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి వేణు, సెక్రటరీలుగా ఎం మధుబాబు, పి కిషోర్‌కుమార్, పి సుధీర్‌కుమార్, సిహెచ్ రమణమూర్తి, పి విజయభారతి, ఎం రామకృష్ణ, కోశాధికారిగా యు అనిల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.



సాహిత్యంలో
వాదోపవాదాలు ఉండకూడదని,
అంతా ఒకే మార్గంలో నడవాలనీ అనుకోకూడదు.
విమర్శ, ప్రతి విమర్శతోనే సాహిత్యం మరింత
మెరుగ్గా వెలువడుతుంది.
- శ్రీశ్రీ



## రెండు నిముషాల మౌనం

ఒకందుకు అనుకుంటే
అందులో అనేక అర్థాలుంటాయి
ఉప్పునీటికి మంచుదిబ్బ కోసుకుపోతున్నంత నిశబ్దం
మూతబడిన రెప్పల బరువు లెక్కగట్టలేం!

టర్కీ నేల మీద సిస్మోగ్రాఫ్ హెచ్చుతగ్గుల బాధితుల కోసమో
ఆఫ్ఘన్ మత ఫిరంగులు చేసిన దాష్టీకానికో
సువిశాల తీరం పక్కన వాలిపోయిన
సిరియా శరణార్థుల మీద ప్రేమతోనో
ఏడుగురు అక్కా చెల్లెళ్ళ వీధుల మధ్యలో
నగ్నంగా రేగిన అల్లరి మూకల చిల్లర పనుల మీద కోపంతోనో
వేదన నిండిన ఆలోచనలు
లోపల్లోపల కలబడుతూ ఉంటాయి

అంతా కలిపి రెండే రెండు నిముషాలు!

అసలైన యుద్ధం ఎవరిదో అర్థం కాదు
నెత్తురు మాత్రం పాలస్తీనా పసిపాపలది
గాజా ఆసుపత్రిలో ఆర్తనాదాలలో భాష
అనువాదానికి అందదు
నిశబ్దానికి మౌనానికి మధ్యన తెలియని ఉద్వేగం
ఉక్రెయిన్ యుద్ధంలో తుపాకీ మన పక్కనే మోగుతుంది
పంట కాలువలో దొరికిన దళిత మృతదేహమే దోషి అని
నిందితుడే తీర్పు రాస్తుంటాడు


అంతా చేస్తే జీవితం క్షణ భంగురం!

ఇంకా సమయం సగం మిగిలే వుంది
బాహ్య ప్రపంచం చెవుల్లోకి దూరడానికి దూకుతూ ఉంది
రహదారి నిండా అంబులెన్స్ రొద
రహస్యంగా దొరికిన మత్తులోనుంచి
మాట్లాడుతున్న విద్యార్థి వాగుడు
హర్షాతిరేకాల మధ్యలో వికెట్
పడిందో లేదో తెలియని స్కోర్ వివరాలు
ఎవరెన్ని రంకెలేసినా
ఈ కాస్త ఏకాగ్రతా ఈదులాటలో మాత్రం
గడియారం చప్పుళ్ళు మినహా
మరే ఇబ్బంది కలగడం లేదు!

సరిగ్గా కళ్ళు తెరిచే సమయం
దగ్గరకి వచ్చేస్తుంది
దిశను మార్చుకుని చూస్తే
ఎటు చూసినా శిథిలాలే
నీడల మీద చెట్లు కూలుతున్న
కకావికల అబ్స్ట్రాక్ట్ పెయింటింగ్
వరద నీట్లో కూలబడిన చేతుల్లో
వరి కంకుల నిండా వడ్లగింజల్లాంటి ప్రశ్నలు
అంతా గందరగోళం చిందరవందర

ఆకుపచ్చని పండు నిండా
రసం పీల్చే పురుగుల లుకలుక
ప్రతి దేశం నుంచి ఒక చేయి గొంతెత్తి నిలబడుతుంది
జారిపోతున్న కలల్ని ఒడిసి పట్టుకోవడానికి
రెండు నిముషాల ఖర్చు చాలదు!
సమయం తీరిపోతుంటే బెంగ
అప్పటికే కళ్ళ నుంచి జల జల
జారిపోతున్న రెండు భూగోళాలు
తల పైకెత్తి చూశాక
మసక మసక చూపులోనుంచి
ఎదురుగా నవ్వుతున్న పిల్లలు!

– అనిల్ డ్యాని
97033 36688



## నో మ్యాన్స్ ల్యాండ్

నిర్జన ప్రదేశంలా ఉన్నా
ఇది భూగ్రహం మీద
కొంత భాగమే!
మనుషులను విభజించి
మనసులను విరిచేసి
అదృశ్య సరిహద్దులను గీస్తూ
శూన్యాన్ని పండిస్తున్న నేల

అప్పుడప్పుడైనా ఓదార్పు గాలి వీచని
ప్రత్యర్థుల ఆధిపత్య యుద్ధాలకు
నిశ్శబ్ద సాక్షిలా
ఎవరికీ చెందని భూమి యిది!

కనుచూపు మేరలో మనిషి లేడు
ఇప్పుడెవరూ
అక్కడ నడవక పోవచ్చు
ఎంత వెదికినా
ఎవరి పాదముద్రలు
కనపడక పోవచ్చు!
కానీ, పురావస్తు తవ్వకాల్లో
ఏదో కాలం నాటి
మనుషుల కాలి ఎముకలు దొరక్కపోవు!

– కుడికాల వంశీధర్
98852 01600

## అంగీకారపు హత్య!


ఒక సామూహిక హత్య
కుటుంబ అనుమతితో
ఎంతో ఎదిగిన నాగరికత
ఆడనలుసే అలుసై ...

చెత్తకుప్పల్లో శ్మశానాల్లో
శవాహారమై
ఇంకెన్నాళ్ళు ఈ అవస్థ?

చరమగీతం పాడే రోజు
త్వరలో రావాలి!

– పుష్యమీ సాగర్
79970 72896

# భారతీయ మానవ జాతుల చరిత్రల్ని పునర్నిర్మించిన రచన




'ఆదియోధుడు' – ఇదివరకు మనువాదుల చేత వక్రీకృతమైన భారతీయ మానవ జాతుల చరిత్రని తిరగదోడి సరికొత్త ప్రతిపాదనలతో సూత్రీకరణలతో పునర్నిర్మించిన ఐతిహాసిక నవల. ఈ రచన రచయిత విఆర్ రాసాని మేధస్సుకు, పరిశోధనా పటిమకు, ఆయన ఇతిహాసాల్ని, చరిత్రని అర్థం చేసుకున్న తీరుకు పతాకస్థాయి. ఈ రచన భారతీయ మానవ జాతుల చరిత్రలలోని కట్టుకథలకి ఆవలి వైపుకు పోయి చూసింది. నాణేనికి రెండోవైపుని పట్టిచూపింది. అశాస్త్రీయమైన మనువాదం, అమానుషమైన సనాతన ధర్మం మళ్ళీ వెర్రితలలు వేస్తున్న ఒక అసందర్భంలో ఈ రచన తన మౌలికమైన ప్రతిపాదనలతో పెద్దఎత్తున చర్చకు దారితీస్తోంది.

ఆదియోధుడు భారత భాగవతాల్లోని శ్రీకృష్ణుడి గాథ. ఇన్నాళ్ళూ ఆ శ్రీకృష్ణుడు ఆర్యుల మనువాద వేద సంస్కృతికి ప్రతినిధిగా మాత్రమే మనకు తెలుసు. అది వాస్తవం కాదని, వాస్తవంలో ఆనాడు దేశంలో పెచ్చరిల్లుతున్న మనువాద ఆర్య సంస్కృతిని అడ్డుకుని మనువాదులతో నిరంతరం పోరాటం చేసి, ద్రవిడ సంస్కృతిని నిలబెట్టిన ఆ ఆదియోధుడు శ్రీకృష్ణుడని ఈ నవల ప్రతిపాదిస్తోంది. ఆర్యులు ఈ దేశానికి వచ్చి, ఆర్య– ద్రవిడ జాతుల మధ్య జరిగిన వైవాహిక సంబంధాల వల్లా, వాటివల్ల కలిగిన సంతానాన్ని ఆర్య బ్రాహ్మణులు తమ సంతానంగా స్వీకరించకుండా గాలికి వదిలివేయడం వల్లా అటు ఆర్యజాతిదైన శ్వేతవర్ణమూ కాకుండా, ఇటు ద్రవిడజాతిదైన కృష్ణవర్ణమూ కాకుండా నీలి–గోధుమ వర్ణాల్లో అనేకమైన సంకర జాతులు పుట్టుకొచ్చాయి. మనువు వాటిని విభజించే ప్రయత్నం చేశాడు. ఆర్య బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని సుస్థాపితం చేయడంకోసం, శూద్రజాతులు ఎప్పటికీ ఏకం కాకుండా ఉండడానికీ, శూద్ర మూలవాసీ జాతులు ఎప్పటికీ వాళ్లకి బానిసలుగా పడుండేలా చెయ్యడానికీ తగిన ఏర్పాట్లు శక్తివంచన లేకుండా చేశాడు. అందుకోసం బ్రాహ్మణులకు అనేక అధికారాలు, అవకాశాలూ; శూద్ర పంచములకు అనేకమైన హేయం, అమానుషమైన కట్టుబాట్లు విధించాడు. ఈ రహస్యాల్ని బద్దలు కొట్టింది ఆదియోధుడు.

వలస ఆర్యులు తమ ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి మొదటిగా పన్నిన పన్నాగం శూద్రజాతులు, ఆదిమూలవాసుల్లో అనైక్యత సృష్టించడం. అందుకోసం పనిచేసిన దాని ప్రతినిధులు నారదుడు, వస్సకుడు, ప్రాపకుడు, వ్యాసుడు, వాల్మీకి తదితరులు. వీళ్ళు వ్యక్తులు కావచ్చు లేదా దానికోసం తరతరాలుగా పాటుబడిన ఆర్యజాతిలోని పారంపర్యమైన కొన్ని తెగలు కావొచ్చు. ఆర్యేతర భారతీయుల్లో అనైక్యతని సృష్టించడంకోసం వాళ్లు ఎంచుకున్న ఆయుధం కన్ఫ్యూజన్. దానిలో భాగంగా శూద్ర, ఆదిమూల వాసుల్లో మతాలను, కులాలను సృష్టించారు. వాటిని పెంపొందించే కథల్ని ఇతిహాసాల్ని అల్లారు. వ్యాస వాల్మీకులు శూద్రజాతి సంతతివాళ్ళైనా– ఆర్య బ్రాహ్మణ భావజాల బానిసత్వ ఊబిలోంచి బయటపడలేకపోయారు.

మనువాదులు మతాలను సృష్టించడం ద్వారా మూలవాసుల్లో జాతిస్పృహ లేకుండా చేశారు. కులాలను సృష్టించడం ద్వారా వాళ్ళ మధ్య ఐకమత్యం లేకుండా చేశారు. శైవులు అంటే ఆదిమూలవాసులు, మధ్య జనిత శూద్రులతో కూడిన ద్రవిడులనీ, వైష్ణవులంటే ఇక్కడికి వలస వచ్చిన ఆర్యులని గుర్తింపకుండా చేశారు. రాజ్యాధికారంలో ఉన్న శూద్రమూల వాసులను క్షత్రియులని విభజించారు. వ్యవసాయ వ్యాపారాల తోటి సిరిసంపదలు చేతిలో ఉన్న శూద్ర మూలవాసులను వైశ్యులని విడదీశారు. ఒకపక్క అప్పటికే విద్యావంతులైన ద్రవిడజాతి పురోహిత వర్గం ఉంది. (శుక్రాచార్యుడు మొదలైన వారితో కూడిన ఆ భావన ఈ నవలలో సరిగా ప్రస్తావించబడలేదు) వాళ్లూ తమ జాతి ఆధిపత్యం నిలుపుకోవడం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆర్య– ద్రావిడ పురోహిత వర్గాల మధ్య రాజ్యాధికార స్పర్ధ మొదటి నుంచీ కొనసాగుతోంది. ఆర్య బ్రాహ్మణులు వైష్ణవం పేరు తోటి, ద్రవిడ బ్రాహ్మణులు శైవం పేరుతోటి క్షత్రియులని తమ తమ వైపు లాక్కోవడం కొనసాగుతూనే ఉంది. అలాంటి ఒక సందర్భంలో పుట్టి ఒకపక్క అశాస్త్రీయం, అమానవీయమైన మనువాద ఆర్య సంస్కృతి దురాక్రమణని అడ్డుకుంటూ, ద్రవిడజాతిని, సశాస్త్రీయం మానవీయమైన ద్రవిడ సంస్కృతినీ, వాటివైన అస్తిత్వాలను నిలబెడుతూ మరోపక్క దేశంలో ఆర్య–ద్రవిడ జాతుల సహజీవనం అనివార్యమని గుర్తించి, వాటి మధ్య సయోధ్య కుదిరించి, వాటి ఐక్యత కోసం ఎనలేని కృషిచేసిన తొలి యోధుడు శ్రీకృష్ణుడని ఈ నవల ప్రతిపాదిస్తోంది.

శ్రీకృష్ణుడి కాలానికి దేశంలో ద్రవిడజాతి, వలస ఆర్యజాతి సంపర్కం వల్ల కలిగిన శూద్ర జాతుల జనాభా గణనీయంగా పెరిగిపోయింది. అందువల్ల ఇక్కడ ద్రవిడార్య సహజీవనం అనివార్యమని కృష్ణుడు గుర్తించాడు. వాళ్ళలో ఐకమత్యం సాధించడం అత్యవసరమని అభిప్రాయపడ్డాడు. ఐతే దాని సాధనకు శ్రమ సంస్కృతి లేని ఆర్య బ్రాహ్మణవాద భావజాలం అడుగడుగునా అడ్డు తగులుతోంది. వాళ్ళు జనాల్లో ఆస్తికత్వాన్ని, కర్మ సిద్ధాంత భావనని నింపేస్తున్నారు. ఎవరూ తమ మాట జవ దాటకుండా వాస్తునీ, పంచాంగాన్నీ, ముహూర్తాల్నీ అడ్డుకట్టగా వేస్తున్నారు. వాళ్ళ లక్ష్య సాధనలో సహకరించినవాళ్లను దేవుళ్లుగా, అడ్డొచ్చిన వాళ్ళని రాక్షసులుగా ప్రచారం చేశారు. కథలూ, ఇతిహాసాలూ అల్లారు. అలాంటి సందర్భంలో ఆర్య– ద్రవిడ జాతుల ఐక్యత అనేది ప్రాంతీయ వివక్షలు లేని విశాల సామ్రాజ్య స్థాపనతోనూ, కుల వర్ణ జాతి మత వివక్షలు లేని విశ్వమానవ ప్రేమ నిండిన సమసమాజ స్థాపనతోనూ మాత్రమే సాధ్యమని కృష్ణుడు నమ్మాడు.

కృష్ణుడు ఆర్య మనువాద వేద సంస్కృతిని దెబ్బ తీసి, శాస్త్రీయ ద్రవిడ సంస్కృతిని సుస్థాపితం చెయ్యడంలో భాగంగానే వివాహాలు చేశాడు. తానూ చేసుకున్నాడు. అనివార్యమైనపుడు యుద్ధాలూ చేశాడు. ఇతరుల చేత చేయించాడు. ద్రవిడవాది ఐన ద్రుపదుని పగ తీర్చడానికి మనువాది ఐన ద్రోణుని అంతం చేస్తానని, దానికోసం అదివరకూ ఆర్య సంస్కృతి పడగనీడలో ఉన్న పాండవుల్ని అందునా అర్జునునిలో మార్పు తెచ్చి, వాళ్ళని తన ఆయుధాలుగా వాడుకుంటానని అతడు ముందే శపథం చేశాడు. అదే మాట ద్రౌపదికి కూడా ఇచ్చాడు. కురుక్షేత్ర యుద్ధంలో స్వజన హననం చేయలేనని యుద్ధ విముఖత చూపిన అర్జునుడికి తన శాస్త్రీయమైన భౌతికవాదం వినిపించి యుద్ధం కొనసాగించి తన ఆశయం నెరవేర్చుకున్నాడు. అలాంటి భౌతికవాదీ, తమ శత్రువూ ఐన శ్రీకృష్ణుడినే భగవంతుణ్ణి చేసేసి, అతడి సమతాభావనలను మాత్రం తొక్కి పెట్టేసింది ఆర్య బ్రాహ్మణవాదం.

చివరలో రాధ కోసం బృందావనం పోయిన కృష్ణుడు అక్కడ గుడిలో ఒక బ్రాహ్మణ పురోహితుడు తననే దేవుణ్ణి చేసి తన విగ్రహానికి పూజలు చేస్తుండడం చూసి విస్తుపోతాడు. కృష్ణుడు చెయ్యలేకపోయిన మనువాద భావజాల హననం పూర్తిచేసి, సమ సమాజాన్ని స్థాపించి ప్రేమైక ప్రపంచాన్ని నిర్మిద్దాం రండని ఆదియోధుడు ద్వారా విఆర్ రాసాని పిలుపునిస్తున్నారు.

కృష్ణుడు స్థాపించిన బహుజన సామ్రాజ్యం మొదలు ఈ దేశాన్ని ఏలిన బహుజనులంతా యాదవ తెగల్లోని వృష్ణిక వంశంగా పిలవబడే నేటి కురబలేనని ప్రతిపాదిస్తుంది ఆదియోధుడు కథనం చేసిన చరిత్ర. చివరగా నాడు శ్రీకృష్ణుడు స్థాపించిన రాజ్య నమూనాలే నేటి ప్రజాస్వామ్య దేశాలుగా దర్శనమిస్తున్నాయని, పరిశోధకులు సాహితీవేత్తలూ ఈ ఒరవడిని కొనసాగిస్తే బహుజనరాజ్యం మళ్ళీ తప్పక వస్తుందనీ ఆశనీ ఆకాంక్షనీ వ్యక్తం చేస్తూ ముగిసింది. ఆ ఆకాంక్ష రచయిత రాసానిది. ఆయన చేసిన యాదవకుల ప్రతిపాదనను యథాతథంగా అంగీకరించడానికి అభ్యంతరాలున్నాయి.

ఆదియోధుడిలో రాసాని చేసిన ఒక గొప్పపని ఏమిటంటే కృష్ణుడి గాథలలోని అద్భుతాలను, అతీతశక్తులను నేల మీదికి దించడం. ఆదివాసీ పూతనతో సహా ఏ స్త్రీ స్తన్యంలోనైనా కమ్మదనమే ఉంటుందనడం, ఆమెను బాలకృష్ణుడు చంపలేదనీ తన స్తనాలకు గాయమైనప్పుడు ఆమె వాటికి పూసుకున్న విషలేపనం శరీరంలోకి ఇంకి చనిపోయిందనడం, ఇంకా తనని చంపడానికి కంసుడు పంపిన రాక్షసుల చావుకు కృష్ణుడి అతీతశక్తులు కాకుండా వాస్తవ కారణాలు చెప్పడం, కుబ్జలోని వంకర్లని తనలోని మహిమ వల్ల కాకుండా తను గురుకులంలో నేర్చుకున్న వైద్యవిద్య వల్ల తీర్చగలిగాడని అనడం, రాక్షసులంటే ఆర్యుల పోరుపడలేక అడవుల్లో తలదాచుకున్న ఆదిమూలవాసులనడం లాంటివి అందుకు సాక్ష్యాలు. ఐతే కృష్ణుడు కంసుడి మదపుటేనుగు భూపీడనం తలని తన చేతులతో బద్దలు కొట్టడనడం, ఆ రోజుల్లోనే ప్రయోగించాక లక్ష్యాన్ని ఛేదించి తిరిగి వచ్చే ఆయుధాలు ఉన్నాయనడం, సౌభకం లాంటి వాయురవాణా సాధనాలు ఉన్నాయనడం, యోజనాల పర్యంతం జీవహననం చేసే ఆయుధాలను తయారు చేయగల సాంకేతికత ఆనాడు ఉందనడం లాంటివి కొంచెం ఆలోచించుకోవాల్సిన అంశాలు. ఏది ఏమైనా మానవ జాతుల వాస్తవ గాథల్ని అవగాహనలోకి తేవడం ద్వారా దేశీయుల్లో గూడుకట్టుకున్న కుల మత జాతి పరమైన అభిజాత్యాల్ని, దురభిమానాల్ని దూరం చేసి, ఆర్యబ్రాహ్మణ భావజాల బానిసత్వంలోంచి బయటపడి విశ్వమానవ ప్రేమతో ముందుకు పోవాల్సిందిగా ఆదియోధుడు సందేశం ఇస్తోంది. ఇన్నాళ్ళూ ఉద్దండులైన సీమ రచయితల్లో ఒక మెట్టు కింద ఉన్నవాడిగా కనబడిన రాసాని ఆదియోధుడి రచనతో ఉన్నతోన్నతమైన ఒక శిఖరారోహణం చేసినట్టు కనబడుతున్నాడు.

– కవితశ్రీ
94946 96990

## గాలి వీస్తుంది

గాలి వీస్తుంది
ఆకులు పోగొట్టుకొని కొన్ని చెట్లు
కొ (రె)మ్మలు విరిచేసుకొని కొన్ని చెట్లు
గాలి నిదానించలేదు
ఒకే దిశగా పరుగులు తీస్తుంది
ఇక నిభాయించుకొని ఏమి కోల్పోకుండా
ఏ చెట్టూ మిగల్లేదు!
గాలి రౌద్రరుపానికి
చెట్లన్నీ సలాం తరువులన్నీ గులాం
మలయమారుతంలా మొదలైన గాలి
చండమారుతమై
ఊడల్ని వ్రేళాడదీసుక బాహుబలిగా
నిలబడ్డ చెట్లు కూలి
వేర్లన్ని అటు ఇటు జరగగ
పెద్ద వృక్షాలే అమాంతం భూమ్మీదికి
వొరగగ ...

– కోటం చంద్రశేఖర్
94920 43348

## వేలిముద్ర

చీకటి మధ్యలో ఏదో జాతరెళ్ళింది
అర్ధరాత్రంతా మద్దెల దరువులు
పిచ్చి అరుపులు.. మై మెరుపులు
ఈలలు.. ఈదురు గాలులు
గాఢ నిద్రలో ఏమైందో గుర్తే లేదు
పొద్దు పొడిచే వేళకి
ఏ సద్దూ లేదు.. చప్పుడూ లేదు
ఇంట్లోకి చొరబడిన కొత్త నీరు
తరచి చూస్తే బురద వాసన
ఎంత చూసినా నేనెవరికీ పట్టనూ లేదు
తలుపు తట్టనూ లేదు
చప్పున గుర్తొచ్చింది.. చూద్దును కదా
చూపుడు వేలిపై సిరాముద్ర
బుద్ధొచ్చే దాకా నిలిచే పుట్టుమచ్చ
నా మొద్దు నిద్రకు ఆనవాలుగా ...

– డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ,
94408 36931

## కథా సంపుటాలకు ఆహ్వానం

కందికొండ రామస్వామి స్మారక పురస్కారం 2023 కోసం 2023 సంవత్సరంలో ముద్రితమైన కథాసంపుటాలను ఆహ్వానిస్తున్నాం. మూడేసి ప్రతులను జనవరి 31, 2024 లోపు పంపాలి. బహుమతి పొందిన కథా సంపుటికి నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరపున ఏప్రిల్‌లో రూ.10 వేల నగదు పురస్కారం, జ్ఞాపిక ప్రదానం చేస్తాము. కథాసంపుటాలు పంపాల్సిన చిరునామా : అబ్దుల్ వహీద్ ఖాన్, ఇంటి నెం. 15– 120/4 /1, రహత్ నాగర్ కాలనీ, నాగర్ కర్నూలు – 509209, తెలంగాణ.

– వనపట్ల సుబ్బయ్య
9492765358

## రాయలసీమ చిత్రలేఖన పోటీలు

రాయలసీమ ప్రాంత జీవన స్థితిగతులు, సంస్కృతి, ప్రకృతి, సమకాలీన సమస్యల నేపథ్యంగా చిత్రలేఖన పోటీలను రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ సామాజిక ఉద్యమకారులు తిమ్మాపురం బాలకష్ణారెడ్డి గారి స్మారకార్థం నిర్వహిస్తున్నాం. 2024 జనవరి 31లోగా 99625 44299 వాట్సప్ నవంబర్‌కు చిత్రాలను పంపాలి. విజేతలకు రూ.10 వేల బహుమతులుగా అందజేస్తాం. మరిన్ని వివరాలకు 9963917187 సంప్రదించవచ్చు.

– డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి,
రాయలసీమ సాంస్కృతిక వేదిక,

## పోస్టు కార్డు కథల పోటీ ఫలితాలు

రమ్యభారతి పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన కోపూరి శ్రీనివాస్ స్మారక పోస్టుకార్డు కథల పోటీలకు మొత్తం 165 కథలు పరిశీలనకు వచ్చాయి. వాటిలో 'సిగ్నల్స్' కథా రచయిత దేశరాజుకు ప్రథమ, 'కార్డు కథ' రచయిత శింగరాజు శ్రీనివాసరావుకు ద్వితీయ, 'దేవుడి స్వగతం' రచయిత కొయిలాడ రామ్మోహన్‌రావుకు తృతీయ బహుమతులు లభించాయి. కె.వి.సుమలత, దారం గంగాధర్, జి.రంగబాబు, పాతూరి అన్నపూర్ణ, నన్ద త్రినాధరావు కథలకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి.


– చలపాక ప్రకాష్, సంపాదకుడు

## 17న జి.ఉమామహేశ్వర్ కథల సంపుటి పరిచయ సభ

ప్రముఖ రచయిత జి.ఉమామహేశ్వర్ కథల సంపుటి 'నెమలీకలు నెమరువేతలు' పరిచయ సభ 17.12. 2023 ఆదివారం ఉదయం 10.30 గంటలకు రవీంద్ర భారతి మినీ హాలులో జరుగుతుంది. సభకు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షత వహిస్తారు. సమ్మెట ఉమాదేవి, సుధాకర్ నీల్, కోడూరి విజయకుమార్, మామిడి హరికృష్ణ, గుడిపాటి ప్రసంగిస్తారు.

– పాలపిట్ట బుక్స్

# సిక్కోలు పేరన విస్తృత చరిత్ర




మన ప్రాచీన సాహిత్యంలో రచయితలు లేరు, కవులే తప్ప. చారిత్రక గ్రంథాలు లేవు, ఇతిహాసాలూ పద్యకావ్యాలూ తప్ప. తెలుగు భాషవరకు రాయవాచకం తొలి చారిత్రక వచనగ్రంథం అనుకుంటే సగం వాస్తవాలు, సగం ఊహలతో అది నిండి ఉంది. కాబట్టే మన పూర్వుల చరిత్రను వాస్తవానికి దగ్గరగా చదువుకోలేకపోతున్నాం. అందుచేత ఏ కాలానికి చెందిన విశేష సామాజిక, చారిత్రకాంశాలను ఆ కాలంలోనే గ్రంథస్థం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవి భవిష్యత్తులో చరిత్ర పరిశోధకులకు కరదీపికలుగా ఉపయోగపడతాయి. ఈ ఏటి విత్తనాలను భద్రపరిస్తేనే కదా, వచ్చే ఏడు నారును సమకూర్చుకోవడం, పంటలు పండించుకోగలగడం. ఇలాంటి సామాజిక సామాజిక కార్యక్రమాలు నిరంతరం కొనసాగవలసిందే! అదే ఎరుకతో గుంట లీలా వరప్రసాదరావు గత వందేళ్ళలో గల శ్రీకాకుళం జిల్లా రాజకీయ చరిత్రను గ్రంథంగా తీసుకొని వచ్చారు.

క్రీ.పూ 272 నాటి మౌర్య సామ్రాజ్యం నుంచి ప్రారంభించి, అశోకుని కళింగ యుద్ధం, ఖారవేలుని శాసనాలను స్మరిస్తూ ప్రారంభిస్తుంది ఈ గ్రంథం. సముద్ర గుప్తుడు, సింగుపురం, మాఠరులు, వాశిష్ఠులు, గాంగులు, దంతపురం, ముఖలింగం, కటకం గజపతులు, ముస్లిములు, పూసపాటి గజపతుల చరిత్రను రచయిత అక్షరీకరించారు. విశాఖ నుంచి ఆంగ్లేయుల పాలన, 1936లో ఒరిస్సా రాష్ట్రం ఏర్పాటు, 1950లో విశాఖ నుంచి శ్రీకాకుళం జిల్లాగా విడివడడం, విజయనగర జిల్లా ప్రారంభం, ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లా నిర్మాణం వరకూ అంకెలూ, సంవత్సరాలతో పాటు లిఖించారు. ఈ విధంగా రేఖామాత్రంగా కళింగదేశ చరితను లీలగా దృశ్యమానం చేశారు లీలా ప్రసాదరావు ఈ గ్రంథంలో!

మద్రాసు ప్రావిన్సులో తొలిసారిగా 1921లో ఎన్నికలు జరిగాయని రాస్తూ, అప్పటినుంచి నేటివరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, స్వాతంత్ర్యానంతర పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు, వాటిలో పోటీ చేసిన అభ్యర్థులు, వారికి వచ్చిన ఓట్లు, ఇలా చాలా వివరాలను జాబితాలుగా ఇచ్చారు. ఈ ప్రాంతంలో జరిగిన ఉప ఎన్నికలు, వాటిలో పోటీపడిన వారు, వాటి ఫలితాలను విడిగా స్పష్టపరిచారు. అదేవిధంగా ఈ ప్రాంతేతరులు ఈ ప్రాంతంలో శాసన సభ్యులుగా, పార్లమెంట్ సభ్యులుగా ఎవరెవరు పోటీ చేశారో కూడా వివరంగా రాశారు. ఈ ప్రాంత రాజకీయ చరిత్రపై పరిశోధించే భావి పరిశోధకులకు ఇది కరదీపిక కాగలదు.

తొలినాళ్ళలో జరిగిన ఎన్నికల నుంచి పాల్గొన్న జస్టిస్ పార్టీ, కాంగ్రెస్, కృషికార్ లోక్‌పార్టీ, స్వతంత్ర, కమ్యూనిస్టు పార్టీలు, ఆనాటి రైతు ఉద్యమాల చరిత్రను కూలంకషంగా ఇందులో చిత్రించారు. ఆయా ఉద్యమాల్లో పాల్గొని తమ జీవితాలను ఎలా త్యాగం చేశారో, వారికి ప్రజలు ఎలా పట్టం కట్టారో కూడా గమనించవచ్చు. ఈ ఎన్నికల యుగం ప్రారంభం నుంచి జమీందారులు, వారి వారసుల నుంచి నేటి ధనిక వర్గాల వరకు నాయకులుగా రూపుదిద్దుకున్న రాజకీయ పరిణామ క్రమాన్ని ఈ గ్రంథంలో తెలుసుకోవచ్చు.

అదేవిధంగా శ్రీకాకుళం జిల్లాలో స్థానిక సంస్థలైన నాన్‌బ్లాక్‌లు, బ్లాక్‌లు, సమితులు, జిల్లా బోర్డులు, జిల్లా పరిషత్తులు ఎప్పుడు ఏర్పడ్డాయో వాటి క్రమాన్ని వివరించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌లుగా పనిచేసిన వారి కాలాలను, ఆయా భోగట్టాలను తెలియజేశారు.

వి.వి.గిరితో పాటు ఈ ప్రాంతపు ప్రముఖులైన అన్నెపు పరశురాం పాత్రో, గౌతు లచ్చన్న, కావలి నారాయుడు, పుల్లెల శ్యామసుందర్, బొడ్డేపల్లి రాజగోపాలరావు, విశ్వాసరాయ నరసింహారావు, పాలవలస సంగన్నాయుడు వంటి ఆనాటి నుంచి నేటివరకుగల ఈ ప్రాంత ప్రముఖుల జీవితాలను సంక్షిప్తంగా రాశారు. ఒకొక్కరూ పొందిన వివిధ పదవులను సంవత్సరాల వారీగా ఉటంకించారు. ఇది గత వందేళ్ళ శ్రీకాకుళ ప్రాంత చరిత్ర విజ్ఞాన సర్వస్వం అని చెప్పవచ్చు.

చివరిలో అంబేద్కర్, పెరియార్‌లతో పరశురాంపాత్రో దిగిన ఫోటోను ముద్రించారు. ఇంకా ఇందులోని క్విట్‌ఇండియా ఉద్యమానికి సంబంధించిన ఫొటోలు, ఇందిరాగాంధీ, ఎన్.టి. రామారావు వంటి ప్రముఖులతో ఇక్కడివారు దిగిన ఫొటోలు కొంతవరకు చారిత్రక అవగాహనను పెంచుతాయనడంలో అతిశయోక్తి లేదు. ఈ ప్రాంతంలో పోటీచేసిన వి.వి.గిరి అనంతర కాలంలో భారత రాష్ట్రపతి అయ్యారని రాశారు. ఈ చరిత్ర చదువుతుంటే ఈ ప్రాంతానికి చెందిన బొబ్బిలి రాజు శ్వేతా చలపతి రామకృష్ణ రంగారావు మద్రాసు ముఖ్యమంత్రి కావడం మినహా, ఇంకెవరూ, ఇంతవరకూ ఈ కళింగాంధ్ర నుంచి ముఖ్యమంత్రి తదితర పెద్ద పదవులకు ఎన్నిక కాలేదని తెలుస్తోంది.

ఈ గ్రంథం వాస్తవానికి శ్రీకాకుళం జిల్లాకు గాని, ఇటీవలి వందేళ్ళకేగాని పరిమితం కాదు. భౌగోళిక విస్తృతిలో ఇది సిక్కోలును దాటి ఒకప్పటి గంజాం, గజపతి, రాయగడ ప్రాంతాలతో కూడిన వైజాగ్‌పటం (విశాఖపట్నం) చరిత్ర అంతటినీ అవసరం మేరకు వీరు ఉటంకించారు. ఎచ్చెర్ల అంబేద్కర్ యూనివర్సిటీలో జర్నలిజం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈయన ఈ గ్రంథంలో తన అనుభవాన్ని జోడించి పక్కా సమాచారంతో దీనిని తీసుకొనివచ్చారు. ఇది భవిష్యత్ రాజకీయ చరిత్రకారులకు అరచేతిలో అద్దమౌతుంది. 232 పేజీలున్న ఈ పుస్తకం వెల రూ. 200. సంప్రందించాల్సిన నెంబరు : 83095 19615.

– గార రంగనాథం
98857 58123

# పార్లమెంటును తప్పుదోవ పట్టించారు

- హమాస్ పై ప్రశ్నకు ఇచ్చిన సమాధానం నాది కాదన్న మంత్రి మీనాక్షి లేఖి
- ఈ వ్యవహారంపై విచారణకు ప్రతిపక్షాలు డిమాండ్



**న్యూఢిల్లీ:** ప్రశ్నలకు నగదు కుంభకోణంలో తణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి మహువా మోయిత్రా బహిష్కరణకు గురైన ఒక రోజు తర్వాత , భారతీయ జనతా పార్టీ (బిజెపి) కపటత్వాన్ని బయటపెట్టే అంశం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఎవరో ఇచ్చిన సాక్ష్యాన్ని బట్టి మహువా మొయిత్రాను దోషిగా నిర్ధారించి లోక్‌సభ నుంచి బహిష్కరించారు. హమాస్‌పై నిషేధానికి సంబంధించి పార్ల మెంటులో అన్‌స్టార్డ్ క్వెశ్చన్‌కు ఇచ్చిన సమాధానం తాను ఇచ్చినది కాదని, పార్లమెంటుకు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి చెబితే దానిని ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. దీనిపై విచారణ జరిపించాలని విదేశాంగ శాఖ కార్యదర్శిని ఆమె కోరినా ఫలితం లేదు. ఈ స్థితిలో పార్లమెంటును తప్పుదారి పట్టించిందెవరో తేలాలంటే దీనిపై తక్షణమే విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించారా, ఇందుకు సంబంధించి ఇజ్రాయెల్ నుండి భారత్‌పై ఏదైనా ఒత్తిడి వచ్చిందా అని కాంగ్రెస్ సభ్యుడు సుధాకరన్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి మీనాక్షి లేఖి పేరుతో ఇచ్చిన సమాధానంలో ఇలా పేర్కొన్నారు"ఒక సంస్థను ఉగ్రవాదిగా పరిగణించాలా లేదా అన్నది చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) ప్రాతిపదికగా నిర్ణయించబడుతుంది. ఏదైనా సంస్థను ఉగ్రవాద సంస్థగా ప్రకటించడం సంబంధిత ప్రభుత్వ శాఖల నిబంధనల మేరకే జరుగుతుంది." అని ఆకుకు అందని పోకకు పొందని రీతిలో ఆ సమాధానం ఉంది. బహుశా, ఈ వైఖరి పట్ల ఇజ్రాయిల్ అసంతృప్తి వ్యక్తం చేసింది కాబోలు, ప్రశ్న అడిగిన ఒక రోజు తర్వాత లేఖి ఆ సమాధానంతో తనకు సంబంధం లేదని సంజాయిషీ ఇచ్చి మరో వివాదానికి తెర లేపారు. "నేను ఆ ప్రశ్న , సమాధానంతో కూడిన ఏ పత్రంపైన సంతకం చేయలేదు," అని ఎక్స్ (ట్విట్టర్)లో ఒక పోస్ట్‌కు బదులిచ్చారు.. ఆ వెంటనే లోక్‌సభ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రశ్నను అప్‌లోడ్ చేయడం గురించి మరో ట్వీట్ ఉంది. లేఖి ఆ సమాధానం సిద్ధం చేయకపోతే, ఎవరు చేశారు అని ఆ ట్వీట్‌లో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు లేఖి స్పందిస్తూ, "విచారణ జరిపిస్తే అసలు దోషి ఎవరో తేలిపోతుంది" అని అన్నారు. ఆ తరువాత లేఖి విలేకరులతో మాట్లాడుతూ, "నా ప్రమేయం లేకుండా ఈ ప్రశ్న సమాధానం ఇచ్చిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విదేశాంగ కార్యదర్శిని కోరాను." అని చెప్పారు. ఇది ప్రభుత్వ వ్యవహారమని, దీంతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆమె సెలవిచ్చారు. లోక్‌సభ వెబ్‌సైట్‌లో కూడా ప్రశ్న ఎలా అప్‌లోడ్ చేశారనే ప్రశ్నకు ఆమె ఇలా అన్నారు, ఈ ప్రశ్నను తీసివేయమని విదేశాంగ కార్యదర్శిని కోరాను. ఒకసారి లోక్‌సభ వెబ్‌సైట్‌లో ఉంటే, దిద్దుబాటు చేయడానికి ముందు కొన్ని విధానాలు, సవరణలు అవసరమని ఆయన నాకు చెప్పారని లేఖి అన్నారు. ఆ వెంటనే విదేశాంగశాఖ ఒక వివరణ ఇస్తూ "డిసెంబరు 8న లోక్‌సభలో ఓ అన్‌స్టార్డ్ క్వెశ్చన్‌కు సమాధానం ఇచ్చిన మంత్రి పేరు వి మురళీధరన్‌కు బదులు పొరపాటున మీనాక్షి లేఖి అని వచ్చింది, ఈ సాంకేతిక లోపాన్ని అంతర్గతంగా పరిష్కరిస్తామని తెలిపింది. మీనాక్షి లేఖి అభిప్రాయానికి, విదేశాంగ శాఖకు చెందిన అధికారి ఇచ్చిన వివరణకు పొంతన కుదరడం లేదు. మోడీ ప్రభుత్వం నిర్ణయాలు చేస్తున్న తీరు, ఆయన కేబినెట్ మంత్రులకే వాటిపట్ల స్పష్టత కొరవడిందనేది దీనిని బట్టి స్పష్టమవుతోంది.

దీనిపై కె. సుధాకరన్ 'ది వైర్'తో మాట్లాడుతూ , "కాంగ్రెస్ ఎప్పుడూ పాలస్తీనా పక్షాన నిలుస్తుంది. ఈ 'ఫ్లిప్ ఫ్లాప్' (ముందొక మాట వెనకొక మాట) పార్లమెంటరీ ప్రత్యేక హక్కును ఉల్లంఘించడమే కాదు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 75 ప్రకారం మంత్రి ప్రమాణ స్వీకార ఉల్లంఘన కూడా. ఇజ్రాయెల్, పాలస్తీనా విషయంలో బిజెపి ఎప్పుడూ సందిగ్ధ వైఖరినే కలిగి ఉంది. స్పష్టత కోసం చేసే ప్రయత్నంలో, ప్రశ్న ఉంచబడింది. ఇప్పుడు ఆమె సంతకం చేయలేదని చెప్పారు.

శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది కూడా ఎక్స్‌పై కొన్ని ప్రశ్నలను లేవనెత్తారు. "ఎవరో సమర్పించిన ప్రశ్నలను అడగడం నిన్న ఒక ఎంపీని బహిష్కరించడానికి దారితీసింది. ఈరోజు, ఒక మంత్రి పార్లమెంటులో ప్రశ్నకు ఇచ్చిన సమాధానానికి తన ఆమోదం లేదని చెప్పారు. దీనిపైనా విచారణ జరపాలి కదా? అని అన్నారు.

హమాస్‌పై నిషేధం విధించాలని ఇజ్రాయెల్ భారత్‌ను కోరుతోంది ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాను నిషేధించడంతో భారత్ కూడా హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా గుర్తించాలని ఇటీవల రాయబారి నౌర్ గిలోన్ అన్నారు . హమాస్‌పై నిషేధించే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఇజ్రాయెల్‌కు భారతదేశం సూచించిందా అని అడిగినప్పుడు, గిలోన్, "మేము మా వైపు నుండి ఏమి చేయాలనుకున్నామో అది చేశామని చెప్పారు.

# అందరి చూపు సుప్రీం వైపే

- నేడు ఆర్టికల్ 370పై తీర్పు




**శ్రీనగర్ :** జమ్మూకాశ్మీర్ ప్రజలే కాదు...ఇప్పుడు దేశ ప్రజలందరూ సుప్రీంకోర్టు వైపే ఉత్కంఠగా చూస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు సోమవారం చారిత్రాత్మక తీర్పు ఇవ్వబోతోంది. రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2019 ఆగస్ట్ ఐదవ తేదీన రద్దు చేసిన విషయం తెలిసిందే. తమ ప్రాంతానికి గతంలో కల్పించిన ప్రత్యేక ప్రతిపత్తిని ఈ తీర్పు ద్వారా అత్యున్నత న్యాయస్థానం తిరిగి కొనసాగిస్తుందని జమ్మూకాశ్మీర్ ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.

ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో 20కి పైగా పిటిషన్లు దాఖలయ్యాయి. పదహారు రోజుల విచారణ అనంతరం సెప్టెంబర్ ఐదున న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారంపై విచారణ జరిపింది. సోమవారం తీర్పు వెలువడనున్న నేపథ్యంలో శాంతి భద్రతల అదనపు డీజీపీ విజయ్ కుమార్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పోలీస్, పౌర అధికారులు హాజరైన ఈ సమావేశంలో శాంతి భద్రతల పరిస్థితిపై చర్చించారు.

తీర్పుపై తాము ఆశాభావంతో ఉన్నామని పిటిషనర్లలో ఒకరైన మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ న్యాయమూర్తి హస్‌నైన్ మసూదీ తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు చట్టవిరుద్ధమని, దానిని రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని న్యాయస్థానాన్ని కోరామని చెప్పారు. 'కేంద్రం నిర్ణయం తీసుకోగానే న్యాయస్థానం తలుపు తట్టాము. ప్రభుత్వ నిర్ణయం మా హక్కులను కాలరాస్తోంది. న్యాయస్థానం మా అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించింది. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నాం. ఎందుకంటే అది రాజ్యాంగ విరుద్ధమైన చర్య' అని వివరించారు.

అయితే రాష్ట్ర రాజధాని శ్రీనగర్‌లోని అనేక మంది మాత్రం తీర్పుపై పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. తనకేమీ ఆశలు లేవని మాజీ మంత్రి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ సీనియర్ నేత నయీమ్ అక్తర్ పెదవి విరిచారు. ఆర్టికల్ 370 రద్దు చట్టబద్ధతకు సంబంధించి సుప్రీంకోర్టు ఇవ్వబోయే తీర్పుపై పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అమలులో ఉన్న ప్రక్రియకు వ్యతిరేకంగా నిర్ణయం వెలువడితే అది రాజ్యాంగ విరుద్ధమవుతుందని చెప్పారు. తదనంతర పరిణామాలు, రాజకీయ మార్పిడులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకప్పటి జమ్మూకాశ్మీర్ రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్థానికులు, ప్రాంతీయ నాయకత్వ అభిప్రాయాలకు విరుద్ధంగా జరిగింది. జమ్మూకాశ్మీర్ రాష్ట్రాన్ని లఢక్ సహా రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు.

**తరిగామి ఆశాభావం**

కాగా తీర్పుపై పిటిషనర్లలో ఒకరైన సీపీఐ (ఎం) నేత యూసఫ్ తరిగామి ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ తీర్పు మా హక్కులు, గౌరవానికి సంబంధించినది. జమ్మూకాశ్మీర్ ప్రజల హక్కులకు గ్యారంటీ ఇస్తున్న రాజ్యాంగబద్ధతకు సంబంధించినది. 2019 ఆగస్టులో జరిగింది ముమ్మాటికీ రాజ్యాంగం పైన, జమ్మూకాశ్మీర్‌ను భారత సమాఖ్యతో కలిపే బంధం పైన దాడే' అని ఆయన చెప్పారు. దీనిని కేవలం తన ఒక్కడి పిటిషన్‌గా చూడరాదని, ఇది దేశ ప్రజలందరికీ సంబంధించినదని తెలిపారు. కేంద్రం నిర్ణయంతో తమ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా చీలిపోయిందని అంటూ తమకు న్యాయం జరగడం, రాజ్యాంగానికి రక్షణ లభించడం ఇప్పుడు ముఖ్యమని తరిగామి అన్నారు.

## మణిపూర్ హింస

- నాగా మహిళ హత్య కేసులో సిబిఐ చార్జిషీట్

ఇంఫాల్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో చెలరేగిన జాతి హింసలో నాగా మహిళ హత్య కేసులో సిబిఐ చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ ఏడాది జులై 15న 55 ఏండ్ల నాగా మహిళను హత్య చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎనిమిది మంది పేర్లను సిబిఐ చార్జిషీట్‌లో పేర్కొన్నది. ఇంఫాల్ తూర్పు జిల్లా సావోంబంగ్ గ్రామంలో మహిళ హత్యకు గురైంది. మెయిటీ మిలిటెంట్ గ్రూప్ అరంబై టెంగోల్ సభ్యులు ఆమెను హత్య చేశారని యునైటెడ్ నాగా కౌన్సిల్ ఆరోపించింది. మరేమ్‌ను మీరా పైబిస్ అనే మెయిటీ మహిళల సంఘం పట్టుకుని, ఉరిశిక్ష కోసం అరంబై టెంగోల్‌కు అప్పగించిందని కూడా వెల్లడించింది. ఈ కేసులో ఛార్జిషీట్‌ను గువహతిలోని ప్రత్యేక సిబిఐ జడ్జి ముందు దాఖలు చేసినట్టు సిబిఐ ఒక ప్రకటనలో తెలిపింది. "జులై 15 న మధ్యాహ్నం 12.10 గంటలకు సావోంబంగ్ గేట్ వద్ద సాయుధ దుండగులతో సహా 100 మంది వ్యక్తులతో కూడిన గుంపు బలవంతంగా ఒక మహిళను నిర్బంధించింది. అదే రోజు మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నిందితుల ప్రమేయం ఉన్నట్టు సిబిఐ విచారణలో తేలింది. ఇతర నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నాం" అని సిబిఐ పేర్కొన్నది. మణిపూర్‌లో మెయిటీలు మెజారిటీగా ఉండగా.. తర్వాత నాగాలు రెండో అతిపెద్ద సమూహంగా ఉన్నారు. మణిపూర్‌లో ఈ ఏడాది మే 3 నుంచి మెయిటీలు, కుకీల మధ్య జాతి సంఘర్షణ జరుగుతున్నది. ఈ హింసాకాండలో 200 మందికి పైగా మరణించగా.. దాదాపు 60,000 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

## మేనల్లుడే రాజకీయ వారసుడు

- ప్రకటించిన బిఎస్‌పి అధినేత్రి మాయావతి


మాయావతితో ఆకాష్ ఆనంద్

**లక్నో :** బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి, యూపీ మాజీ సీఎం మాయావతి తన వారసుడిగా మేనల్లుడు ఆకాష్ ఆనంద్(28)ను ప్రకటించారు. దీంతో 2024లో రాబోయే లోక్‌సభ ఎన్నికలకు ముందు మాయావతి తన రాజకీయ వారసుడి పేరును ప్రకటించటం ప్రాధాన్యతను సంతరించుకున్నది. దీంతో చిన్న వయసులోనే ఆకాశ్ ఆనంద్ పార్టీలో ఆయన కీలకం కానున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పార్టీ సన్నాహాలను పరిశీలించడానికి మాయావతి లక్నోలో ఏర్పాటు చేసిన అఖిల భారత బిఎస్‌పి సమావేశంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికలకు ముందు బీఎస్పీని బలోపేతం చేసే బాధ్యతను కూడా ఆకాష్‌కు అప్పగించారు.ఆకాష్ ఆనంద్ గత సంవత్సరం నుంచి పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. ఆనంద్ మాయావతి తమ్ముడు ఆనంద్ కుమార్ కుమారుడు. ఆనంద్ కుమార్ 2019లో పార్టీ ఉపాధ్యక్షుడిగా, ఆకాష్ ఆనంద్ జాతీయ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ సమావేశానికి హాజరైన బిఎస్‌పి నేత ఉదయవీర్ సింగ్ మాట్లాడుతూ.. "బిఎస్‌పి అధినేత్రి మాయావతి తన వారసుడిగా ఆకాష్ ఆనంద్‌ను ప్రకటించారు. ఆకాష్ ఆనంద్ బిఎస్‌పి ఉనికిని, పార్టీ బలహీనంగా ఉన్న చోట ఎన్నికల సన్నాహాలను పరిశీలిస్తారు. బెహెన్ జీ (మాయావతి) యూపీ, ఉత్తరాఖండ్‌లలో పార్టీకి నాయకత్వం వహిస్తారు. ఆనంద్ జీ ఇతర రాష్ట్రాల్లో పార్టీకి నాయకత్వం వహిస్తారు" అని తెలిపారు.

## కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ కుప్పకూలుతుంది

### మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి



**బెంగళూరు :** లోక్‌సభ ఎన్నికల తరువాత కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ కుప్పకూలుతుందని మాజీ ముఖ్యమంత్రి, జెడి(ఎస్) నాయకులు హెచ్‌డి కుమారస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌కు చెందిన ఒక సీనియర్ నేత ఇప్పటికే కేంద్రంలోని బిజెపి నాయకులతో చర్చలు జరిపారని ఆరోపించారు. ఆదివారం హాసన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 50 మంది ఎమ్మెల్యేలతో బయటకు వస్తానని సదరు నేత బిజెపికి హామీ ఇచ్చినట్లు సమాచారం ఉందని కుమారస్వామి తెలిపారు. అయితే ఆ కాంగ్రెస్ నేత పేరు వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. 'మహారాష్ట్రలో జరిగినట్లే ఇక్కడ కూడా జరగవచ్చు. ఎవరికీ నిజాయితీ లేదు, పార్టీకి నిబద్ధత లేదు. ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలను వాళ్లు చూసుకుంటారు. రాజకీయాల్లో ఇదే జరుగుతుంది' అని కుమారస్వామి తెలిపారు.


## ప్రజా సంఘాల నిరసన సభకు అనుమతి నిరాకరించిన ఢిల్లీ పోలీసులు

- ప్రపంచ మానవ హక్కుల దినోత్సవంనాడే ఘటన

**న్యూఢిల్లీ :** ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ప్రజా సంఘాలకు వింత అనుభవం ఎదురైంది. జంతర్ మంతర్ ప్రాంతంలో నిర్వహించాల్సిన ప్రజా సంఘాల నిరసన సభకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవంనాడే తమకు నిరసన చేసే అనుమతిని ఢిల్లీ పోలీసులు ఇవ్వకపోవటంపై వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోలీసుల తీరు సరికాదని అన్నారు. ఇది తమ హక్కులను హరించటమేనని ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ కారణాలల దృష్ట్యా నిరసనను అనుమతించలేదని న్యూఢిల్లీ అదనపు డిప్యూటీ కమిషనర్ రవికాంత్ కుమార్ అన్నారు. ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా పౌర హక్కులు, విద్యార్థి, ప్రజాస్వామ్య, మహిళా హక్కుల సంఘాలు, అనేక ఇతర సంస్థల కూటమి నవంబర్ 28న పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో నిరసన సభ కోసం అనుమతి కోసం దరఖాస్తు చేసింది. ఈ కార్యక్రమం భారతదేశంలో మానవ హక్కులపై చర్చించటంపై దృష్టి పెడుతుందని ఆయా సంఘాలు లేఖలో పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జనరల్ సెక్రెటరీ డి రాజా, తెలంగాణలో అణచివేతకు వ్యతిరేకంగా పోరాడే ఫోరం కన్వీనర్ జి హరగోపాల్, ఉద్యమకారుడు ఆసిఫ్ ఇక్బాల్ తన్హా, ఆదివాసీ హక్కుల కార్యకర్త సర్జూ టేకం, కార్మిక హక్కుల కార్యకర్త బచ్చా సింగ్‌తో సహా పలువురు హక్కుల కార్యకర్తలు పాల్గొనాల్సి ఉన్నది.

# కొడిగట్టిన మానవ హక్కులు

- గాజాలో ఇజ్రాయిల్ దాష్టీకాలకు అంతం లేదా?
- మృతప్రాయమైన ఐరాస డిక్లరేషన్



**గాజా స్ట్రిప్ :** 1948 డిసెంబర్ 10వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలన్నింటికీ వర్తించేలా మానవ హక్కుల డిక్లరేషన్‌ను ఆమోదించింది. అయితే ఇప్పుడు దానికి అర్థమేముంది? విలువ ఏముంది? అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని అన్ని దేశాలు ఆదివారం ఘనంగా జరుపుకున్నాయి. మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామంటూ గొప్పగా ప్రతిజ్ఞలు చేశాయి. అయితే ఇజ్రాయిల్ దాడులతో భీతిల్లుతున్న గాజా నుండి వస్తున్న వార్తలు, చిత్రాలు ఈ ప్రతిజ్ఞలను అవహేళన చేస్తున్నాయి.

హమాస్ మిలిటెంట్లు అక్టోబర్ 7న దాడులు జరిపి అనేక మంది ఇజ్రాయిలీలను హతమార్చిన మర్నాడే గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రకటించింది. అప్పటి నుండి ఇజ్రాయిల్ దళాలు జరుపుతున్న వైమానిక దాడులు, కురిపిస్తున్న బాంబుల వర్షం కారణంగా పదిహేను వేల మంది పాలస్తీనియన్ల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వీరిలో ఆరు వేల మంది అభం శుభం తెలియని చిన్నారులేనన్న కఠోర వాస్తవం హృదయాలను కదిలించివేస్తోంది. ఇప్పుడు 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఆమోదించిన మానవ హక్కుల డిక్లరేషన్‌లో ఏముందో చూద్దాం...'మానవ కుటుంబంలోని సభ్యులందరి స్వాభావిక గౌరవానికి, సమానమైన, విడదీయరాని హక్కులకు గుర్తింపు అనేది ప్రపంచంలోని స్వేచ్ఛ, న్యాయం, శాంతికి పునాది' అని ఆ డిక్లరేషన్ తెలిపింది. అయితే మానవ హక్కుల దినోత్సవం రోజున ఆ డిక్లరేషన్ మృతప్రాయమైపోయింది.

అంతకుముందు కూడా తమ విదేశీ విధాన లక్ష్యాలను సాధించడానికి సంపన్న, పశ్చిమ దేశాలు మానవ హక్కులను ఓ ఆయుధంగా వాడుకున్నాయన్నది సుస్పష్టం. మానవ హక్కుల డిక్లరేషన్‌కు కొద్ది నెలల ముందు ఇవే పశ్చిమ దేశాల సాయంతో ఇజ్రాయిల్ దేశం ఉనికిలోకి వచ్చింది. ఫలితంగా ఏడున్నర లక్షల మంది పాలస్తీనియన్లను తమ నివాసాల నుండి, మాతృభూమి నుండి తరిమేశారు. ఇజ్రాయిల్‌లోని 80% జనాభా దేశం నుండి బహిష్కరణకు గురికావడమో లేదా పొరుగు దేశాలకు పారిపోయి అక్కడ చెప్పుకోవడానికి తమకు దేశమన్నదేలేని స్థానికులుగా మిగిలిపోవడమో జరిగింది.

**చలనం లేని ఇజ్రాయిల్**

మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని, అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ ఇజ్రాయిల్ ఎంత మాత్రం చలించడం లేదు. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ నిరంతరాయంగా యుద్ధం చేస్తోంది. సాయుధ ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాలలో సైతం పౌరులకు రక్షణ కల్పించాలన్న ఐరాస ప్రాథమిక సూత్రాలను కూడా తుంగలో తొక్కుతోంది. పాలస్తీనా ప్రజల, ఆక్రమిత ప్రాంతాలలోని ఇతర అరబ్బుల మానవ హక్కులకు భంగం కలిగేలా ఇజ్రాయిల్ చేపట్టిన చర్యలపై విచారణ జరిపేందుకు ఐరాస 1968లో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. అక్రమంగా నివసిస్తున్న వారు ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాలలో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఇటీవల విడుదలైన ఓ నివేదిక తెలిపింది.

మానవ హక్కుల డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలంటూ 1970 డిసెంబర్ 15న ఆమోదించిన తీర్మానంలో ఐరాస సర్వసభ్య సమావేశం ఇజ్రాయిల్‌ను కోరింది. 1989లో బాలల హక్కులపై ఐరాస కన్వెన్షన్‌ను ఆమోదించారు. దీనిని 1991లో ఇజ్రాయిల్ సమర్థించింది. అయితే వెస్ట్‌బ్యాంక్‌కు ఇది వర్తించదంటూ మెలిక పెట్టింది. గాజా స్ట్రిప్‌లో బాలల హక్కుల ఉల్లంఘనలు తరచూ చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఐరాస నడుపుతున్న పాఠశాలలు సహా విద్యకు సంబంధించిన మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. చిన్నారులపై యథేచ్ఛగా బాంబు దాడులు జరుగుతున్నాయి. మానవ హక్కులకు సంబంధించిన ఐరాస తీర్మానాలపై ఇజ్రాయిల్ 1991 వరకూ సంతకమే చేయలేదు. పైగా పాలస్తీనా ప్రజల హక్కులను నిరాకరిస్తూ 2018లో ఓ చట్టాన్ని తీసుకొచ్చింది.

**రోజుకు 170 మంది చిన్నారులు బలి**

గాజాపై యుద్ధం చేసిన 40 రోజులలో ప్రతి రోజూ ఇజ్రాయిల్ 170 మంది చిన్నారులను పొట్టనపెట్టుకున్నదని అల్ జజీరా ఛానల్ తెలిపింది. చిన్నారులకు గాజా స్మశానవాటిక అయిందని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ నవంబర్ 6న ప్రకటించారు. జరుగుతున్న దారుణాలకు ఇజ్రాయిల్‌ను బాధ్యురాలిని చేయడంలో ప్రపంచదేశాలు విఫలమయ్యాయని పాలస్తీనియన్ క్రానికల్ పత్రిక ఆరోపించింది. మొత్తంమీద మానవ హక్కుల డిక్లరేషన్ల ఉనికిని నాశనం చేసేందుకు బాంబు దాడులు జరుగుతున్నాయి. ఆ డిక్లరేషన్లు చిన్నారుల మృతదేహాలతో నిండిపోయిన గాజా శిథిలాల కింద తగలబడుతున్నాయి.

## జిడిపి పెరిగింది సరే...

(మొదటి పేజీ తరువాయి)

2.2%కి పడిపోయింది. గడచిన త్రైమాసిక కాలంలో కొంచెం పెరిగి 2.8%కి చేరింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వినియోగ వ్యయం పెరిగినా రెండో త్రైమాసికంలో తగ్గింది. వినియోగ వ్యయం తగ్గడానికి కారణమేమిటి? ఖర్చు చేయడానికి కావాల్సిన ఆదాయం ప్రజల వద్ద లేకపోవడమే. ప్రజలు తక్కువ ఆదాయంతో ఎలాగో ఒకలా బతుకులు నెట్టుకొస్తుంటే.. మూలిగే నక్కపై తాటికాయ పడిన విధంగా ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తోడయ్యాయి. జిడిపిలో ఇవి ప్రత్యక్షంగా ప్రతిబింబించవు. కానీ వినియోగ వ్యయ వృద్ధి స్థాయిలలో స్పష్టంగా కన్పిస్తాయి. జిడిపికి, దాని వృద్ధికి ఏయే రంగాలు ఎంత మేరకు దోహదపడుతున్నాయో తెలిపే గణాంకాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. వీటి ప్రకారం వ్యవసాయ రంగం పాత్ర స్వల్పంగా ఉండడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. తయారీరంగం, మైనింగ్, నిర్మాణం, విద్యుత్, నీరు వంటివి జిడిపి వృద్ధికి దోహదపడుతున్నప్పటికీ వ్యవసాయ రంగం కారణంగా ఆ వృద్ధి ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. దేశంలో ఉపాధి కల్పనకు వ్యవసాయం అతి పెద్ద వనరుగా ఉంది. రైతులకు చేయూతనివ్వడానికి బదులు వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. వీటి ఫలితంగా వ్యవసాయంపై ఆధారపడిన వారు అప్పులపాలయ్యే పరిస్థితి ఉంటోంది. దేశంలో మూడింట రెండు వంతుల జనాభాకు వ్యవసాయంతో సంబంధం ఉంది. అలాంటి ఈ రంగంలో వృద్ధి తక్కువగా ఉండడం దేనికి సంకేతం? ఈ రంగంపై ఆధారపడిన అనేక మందికి ఆదాయం మెరుగ్గా లేదు. ఈ రంగంలో ఉద్యోగ అవకాశాలు కూడా తక్కువగానే ఉంటాయి. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం ప్రభుత్వ వ్యయాన్ని పెంచడమే. అప్పుడే ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయి. ప్రజలకు కొంత ఊరట లభిస్తుంది. కానీ జిడిపిలో ప్రభుత్వ వ్యయం తగ్గిపోతోంది. అదే ఆందోళన కలిగించే విషయం.

## వేలంవెర్రిగా 'ఉచిత' రాజకీయాలు

- సంక్షేమ పథకాలపై ఉపరాష్ట్రపతి ధన్కర్ పెదవివిరుపు

**న్యూఢిల్లీ :** ప్రస్తుతం దేశంలో వేలంవెర్రిగా ఉచిత పథకాల రాజకీయాలు జరుగుతున్నాయని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ విమర్శించారు. ఈ ఉచితాలు వ్యయ ప్రాధాన్యతలను వక్రీకరిస్తున్నాయని అన్నారు. 'జేబులను కాదు, మానవ మనస్సులను శక్తివంతం చేయడం అవసరం' అని సంక్షేమ పథకాలపై ఉపరాష్ట్రపతి పెదవివిరిచారు. ఉచితాలపై ఆరోగ్యకరమైన రాజకీయ చర్చ అవసరమని అన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ధన్కర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే ప్రపంచంలో ఏ దేశంలో కూడా భారత్ మాదిరిగా మానవ హక్కులు, అభివృద్ధితో వికసించడం లేదని తెలిపారు. 'మన నాగరికత, రాజ్యాంగం మానవ హక్కులను గౌరవించడం, పరిరక్షించడం, పెంపొందించడం పట్ల మనకు ఉన్న గాఢమైన నిబద్ధతను ప్రతిబింబిస్తాయి' అని అన్నారు.


## అట్లాంటాలో కాల్పులు

- ముగ్గురు మృతి

**న్యూయార్క్ :** అమెరికాలోని అట్లాంటాలో శనివారం సాయంత్రం జరిగిన కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. మరొకరు గాయపడ్డారు. పీచ్‌ట్రీ రోడ్ ఎన్‌ఇలో స్థానిక కాలమానం ప్రకారం.. శనివారం సాయంత్రం 6.25 గంటల ప్రాంతంలో ఈ కాల్పులు చోటుచేసుకున్నట్లు అట్లాంటా పోలీసు విభాగం అధికారులు తెలిపారు. ఘటనాస్థలంలోనే ముగ్గురు చనిపోయారని, మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఈ ప్రతిజ్ఞలు చాలవు

- 30 శాతం లక్ష్యాన్ని మాత్రమే చేరుకుంటాం
- కాప్ 28 సదస్సుపై ఐఇఎ నివేదిక



**దుబాయ్ :** ప్రస్తుతం జరుగుతున్న కాప్ 28 సదస్సులో ఇప్పటి వరకూ చేసిన ప్రతిజ్ఞలు, వాగ్దానాలు సరిపోవని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) స్పష్టం చేసింది. ఈ ప్రతిజ్ఞలతో 2030 నాటికి చేరుకోవాల్సిన లక్ష్యాల్లో 30 శాతం మాత్రమే చేరుకుంటామని ఐఇఎ తన నివేదికలో తెలిపింది. ఐఇఎ విడుదల చేసిన తాజా నివేదికలో ప్రస్తుత ప్రతిజ్ఞలతో 2030 నాటికి తగ్గించాల్సిన గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను 30 శాతం మాత్రమే తగ్గించగలమని స్పష్టం చేసింది. 'గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను పరిష్కరించడానికి ఇలాంటి ప్రతిజ్ఞలు సానుకూల అడుగుల గానే కనిపిస్తున్నా.. అంతర్జాతీయ వాతావరణ లక్ష్యాలను చేరుకునే మార్గంలోకి, ప్రధానంగా గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేసే లక్ష్యానికి ప్రపంచాన్ని తీసుకుని వెళ్లడానికి ఈ ప్రతిజ్ఞలు సరిపోవు' అని ఐఇఎ తన నివేదికలో తెలిపింది. దుబాయ్‌లో ఈ నెల 12 వరకు కాప్ 28 సదస్సు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సులో వివిధ దేశాల ప్రభుత్వాలు, సంస్థలు చేసిన ప్రతిజ్ఞలపై అంచనా ఆధారంగా ఐఇఎ ఈ నివేదిక విడుదల చేసింది. ఐరాస వాతావరణ సంస్థ వివరాల ప్రకారం ప్రతిజ్ఞలపై 130 దేశాలు సంతకాలు చేశాయి. అయితే ఇప్పటి వరకూ భారత్, చైనా, రష్యా, సౌదీ అరేబియాలు సంతకం చేయలేదు. తీవ్రతరమవుతున్న కరువు, తుఫాను, సముద్ర మట్టాల పెరుగుదల వంటి వాతావరణ మార్పుల యొక్క వినాశనాలను నివారించడానికి గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉంచాలని 2015 పారిస్ ఒప్పందం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే 2030 నాటికి మీథేన్ ఉద్గారలను సున్నా స్థాయికి తీసుకొస్తామని సుమారు 50 చమురు, గ్యాస్ కంపెనీలు వాగ్దానం చేశాయి. గ్రీన్‌హౌస్ వాయువుల వార్మింగ్‌లో మీథేన్ పాత్ర ఎక్కువగా ఉంటుంది. కార్బన్ డయాక్సైడ్ రెండో స్థానంలో ఉంటుంది.

## ఇజ్రాయిల్‌కు అత్యవసర ఆయుధ సరఫరాకు బైడెన్ ఆమోదం

**న్యూయార్క్ :** అమెరికన్ కాంగ్రెస్ ఆమోదంతో పనిలేకుండా ఇజ్రాయిల్‌కు ట్యాంకుల్లో వాడే మందుగుండు(షెల్స్) ను సరఫరా చెయ్యాలని జో బైడెన్ నిర్ణయించాడు. గాజాలో హమస్ పైన ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి మద్దతుగా 106.5మిలియన్ల విలువచేసే ఆయుధ సామాగ్రిని ఇజ్రాయిల్‌కు సరఫరా చేయటానికి కాంగ్రెస్ ప్రమేయం లేకుండా బైడెన్ అత్యవసర అనుమతిని ఇచ్చారు. ఇజ్రాయిల్‌కు అత్యవసరంగా ట్యాంకు షెల్స్ సరఫరా చేయవలసిన అవసరం ఏర్పడిందన్న విషయాన్ని గమనించాలని అమెరికా విదేశాంగ శాఖ కాంగ్రెస్‌కు తెలిపింది. అమెరికా జాతీయ భద్రతా ప్రయోజనాలను పరిరక్షించటానికి మాత్రమే అమెరికా అధ్యక్షుడు అత్యవసర నిర్ణయాలను తీసుకోగలుగుతాడు. ఇలా ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరా చేయటానికి అత్యవసర ఆమోదం ఇవ్వటం అంతకు ముందు బైడెన్ ప్రతిపాదిత 106బిల్లియన్ల సప్లిమెంటల్ సెక్యూరిటీ వ్యయాన్ని అమెరికన్ కాంగ్రెస్ తిరస్కరించిన నేపథ్యంలో జరిగింది. అలా తిరస్కరింపబడిన 106బిల్లియన్ల వ్యయ ప్రతిపాదనలో 14.3బిల్లియన్ల విలువైన మద్దతు ఇజ్రాయిల్ కు ఉద్దేశింపబడింది. ఇజ్రాయిల్, ఉక్రెయిన్ రెండు దేశాలకు కలిపి మద్దతు వ్యయాన్ని ఆమోదించాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ పట్టుపట్టాడు. అందుకు రిపబ్లికన్లు ఒప్పుకోలేదు. ఉక్రెయిన్ కు అప్పటికే 113బిల్లియన్ డాలర్ల సహాయాన్ని అందించామని, రష్యాపైన గెలవటానికి కావలసిన వ్యూహం లేకుండా బైడెన్ ప్రభుత్వం అనవసరంగా యుద్ధాన్ని కొనసాగిస్తోందని రిపబ్లికన్లు విమర్శిస్తున్నారు. గాజాలో పౌరుల మరణాలను అదుపుచేయాలనే షరతుతో మాత్రమే ఇజ్రాయిల్ కు సైనిక సహాయం అందించాలని కొందరు డెమోక్రాట్లు కోరుతున్నారు.

## మూల హిందూత్వ మరింత సంఘటితం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించాల్సిందిగా మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలని పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది.

**ఐపిసి, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ చట్టాల మార్పు బిల్లులపై...**

భారత శిక్షాస్మృతి (ఐపిసి), నేర ప్రక్రియా స్మృతి (సిఆర్‌పిసి), భారత సాక్ష్యాధార చట్టం (ఎవిడెన్స్)లను మార్చేసేందుకు ఉద్దేశించిన బిల్లులను పార్లమెంటరీ జాయింట్ సెలెక్ట్ కమిటీకి పంపాలని సిపిఎం డిమాండ్ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ మూడు కీలకమైన చట్టాలను మార్చేసేందుకు పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టి హడావిడిగా ఆమోదింపజేసుకోవాలని మోడీ ప్రభుత్వం చూస్తోంది. ఈ ముసాయిదా బిల్లులలో అనేక తీవ్రమైన లోపాలున్నాయని, ప్రజాతంత్ర హక్కులకు, పౌర స్వేచ్ఛలకు, క్రిమినల్ న్యాయ వ్యవస్థపై తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రమాదముందని పేర్కొంది. ఈ బిల్లులను సమీక్షించేందుకు లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సెలెక్ట్ కమిటీకి తప్పనిసరిగా పంపాలని డిమాండ్ చేసింది. ఆ తర్వాత మాత్రమే వాటిని చట్టాలుగా చేసుకోవచ్చునని పేర్కొంది.

**జమ్మూకాశ్మీర్‌లో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి**

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియను పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితా ప్రకటించి, రాష్ట్రంలో శాంతిభద్రతలను నెలకొల్పామని చెప్పుకుంటున్నందున జమ్ముకాశ్మీర్‌లో తక్షణమే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. 2018లోనే జమ్ముకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాల్సివుండేది. కాశ్మీర్ పునర్విభజన చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగానే ఆ చట్టానికి సవరణలు చేస్తూ రెండు బిల్లులను లోక్‌సభ ఇటీవల ఆమోదించిందని సిపిఎం తెలిపింది. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం తన తీర్పును రిజర్వు చేసి, ఈ నెల 11న (సోమవారం) వెలువరించనుంది. సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకూ ఆగకుండానే హడావిడిగా చట్టాన్ని సవరించడం ప్రజాస్వామ్య, న్యాయ ప్రక్రియలను రెండింటినీ ఉల్లంఘించడమేనని సిపిఎం తప్పుబట్టింది. అంతేకాకుండా ఎన్నికైన సభ్యులుండాల్సిన శాసనసభకు సభ్యులను నామినేట్ చేసే అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నరుకు కట్టబెడుతూ ఈ సవరణలు చేశారని తెలిపింది. ఇది పూర్తిగా అప్రజాస్వామిక చర్య అని సిపిఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటువంటి నామినేషన్స్ ఏవున్నా అవి ఎన్నికైన చట్టసభ ద్వారానే జరగాలని, అంతేకాని ఏ విధంగానూ ఎన్నిక కానట్టువంటి కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ద్వారా ఈ నామినేషన్లు ఉండరాదని సిపిఎం స్పష్టం చేసింది.

**తిరువనంతపురంలో కేంద్ర కమిటీ సమావేశం**

కేరళ రాజధాని తిరువనంతపురంలో జనవరి 28 నుంచి 30 వరకు కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు సిపిఎం తెలిపింది.



ఇటీవల ఉత్తరాఖండ్‌లో సొరంగం కూలిపోయి, 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయినప్పుడు వారు సజీవంగా బయటపడాలని దేశమంతా కోరుకొంది. అలాంటి విపత్తు వేళ ఆ సొరంగంలోకి చొచ్చుకువెళ్లి, వారిని కాపాడడంలో కీలకపాత్ర పోషించారు వారు. పొట్టకూటికి ప్రాణాలను ఫణంగా పెట్టి, భూగర్భ ప్రాంతాల్లో పనులు నిర్వహించే ఆ సామాన్యులు ఇప్పుడు దేశం ముందు సాహసవీరులుగా నిలబడ్డారు. సొరంగ ప్రమాదంలో చిక్కుకుపోయిన కార్మికులను రక్షించిన ర్యాట్ మైనర్స్ ఇప్పుడు అందరి ప్రశంసలూ పొందుతున్నారు.



# గాలిపటం... దారం



సిద్ధు గాలిపటం తయారు చేయడానికి రంగు కాగితాలు తెచ్చాడు. మిత్రుడు దేవరాజ్ సహాయంతో చక్కని గాలిపటం తయారు చేశాడు. సెలవు దినం కావడంతో పాఠశాల మైదానంలోకి వెళ్లి గాలిపటానికి చక్కగా దారం కట్టి, సిద్ధు, దేవరాజ్ ఎగరవేస్తున్నారు. అక్కడ ఖాళీ స్థలం ఎక్కువగా ఉండడంతో గాలిపటం రివ్వు రివ్వున పైకి వెళ్తున్నది.

ఆకాశంలో విహారం చేస్తున్న గాలిపటాన్ని చూస్తూ పిల్లలు ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. అది చూసి, ఎగురుతున్న గాలిపటం చాలా గర్వపడింది. తనకు దిగువన ఉన్న దారం వైపు చూసి నవ్వింది.

'ఎందుకు నవ్వుతున్నావ్' అని దారం అడిగింది. 'చూసావా! పిల్లలు నన్ను చూసి ఎలా కేరింతలు కొడుతున్నారో' అంది గాలిపటం. అప్పుడు దారం 'నేను ముందు చూపే చూడగలను. నేను కింద వైపు చూస్తే నీకే ప్రమాదం' అంది.

'నాకు ప్రమాదమా! నీకేమైనా మతి పోయిందా?' అని ఎగతాళిగా అంటూ' పిల్లలు నన్ను చూసి కేరింతల కొడుతున్నారని నువ్వు ఉడుక్కుంటున్నావు' అని గాలిపటం హేళనగా మాట్లాడింది.

అప్పుడు దారం, 'మిత్రమా! అలా ఏమీ కాదు. నిన్ను పై పైకి తీసుకువెళ్లడమే నా పని. నా ఆసరాతోనే నువ్వు ఎగురుతావు. నేను ఆ పనిలో నిర్లక్ష్యం చేస్తే నీకు ఆపద వచ్చే ప్రమాదం ఉంది.' అని వివరించింది. అయినా గాలిపటం ఒప్పుకోలేదు. 'నిన్నెవరూ పట్టించుకోరు. అందుకే అలా అంటున్నావు' అని మళ్లీ ఎగతాళి చేసింది.

గాలిపటం గర్వాన్ని అణచాలని దారం వెంటనే కాస్త కింది వైపుకు దిగింది. అంతే, గాలిపటం పల్టీలు కొడుతూ ఉక్కిరిబిక్కిరి అయింది. అప్పుడు దారం విలువ గాలిపటానికి తెలిసింది.


దారం వైపు చూస్తూ 'నన్ను క్షమించు మిత్రమా, నువ్వు లేకపోతే నేను లేనని నాకు అర్థమైంది. నీ ఆసరాతోనే నేను చక్కగా ఎగరగలుగుతాను. నన్ను పడిపోకుండా రక్షించు' అని వేడుకొంది. వెంటనే దారం సర్దుకుంది. గాలిపటం మరలా ఆకాశంలో ఎగర సాగింది.

దారం వైపు చూసి, 'నన్ను క్షమించు మిత్రమా, నీ విలువ తెలుసుకోకుండా హేళన చేశాను' అంది.

'మిత్రమా మనం ఒకరికి ఒకరం ఆసరాగా ఉండాలి. నేను నీకు ఆసరా. నాకు గాలిపటం ఎగరేసే ఆ బాలుడు ఆసరా. ఇందులో ఎవరు అజాగ్రత్తగా ఉన్నా అందరికీ ఇబ్బంది. అది తెలుసుకుని నడుచుకోవడమే మన పని' అని దారం వివరించి చెప్పింది.

– మొర్రి గోపి, 94945 90820.

## నేను గీసిన బొమ్మ




తాలాడ అనికేత్ శరణ్,
7వ తరగతి, న్యూ సెంట్రల్ స్కూల్,
పి.యన్. కోలని, శ్రీకాకుళం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# భూగర్భ సాహసికులు ...



ఈశాన్య ఢిల్లీలోని ఖజూరి ఖాస్ ప్రాంతం వారిది. పగలు కూడా చీకటితో మూసుకుపోయిన వీధుల గుండా, భూగర్భంలో గ్యాస్, నీళ్లు, డ్రైనేజీ పైపుల నిర్మాణం, సొరంగాలు తవ్వడం, మరమ్మతులు చేసే పనులతోనే అక్కడి పురుషులు నిద్రలేస్తారు. అత్యంత ప్రమాదకర వాతావరణంలో ఏ విధమైన సురక్షిత సదుపాయాలు లేకుండా ప్రాణాలకు తెగించి మరీ పనిచేస్తారు. ఇంతటి దయనీయ పరిస్థితుల్లో.. ఊహించని సంఘటనగా ఉత్తరాఖండ్ సొరంగ ప్రమాదం వారిని పలకరించింది.

17 రోజులకు పైగా సొరంగంలో చిక్కుకుపోయిన 42 మంది కార్మికులని రక్షించేందుకు ఆ బస్తీ నుంచి ఓ ఐదుగురు బృందం బయల్దేరింది. ప్రాణాలకు తెగించి మరీ, కార్మికులను రక్షించిన క్షణాన సహాయక బృందాన్ని 'ర్యాట్ మైనర్స్' పేరుతో యావత్ దేశం అభినందించింది. మీడియాలో వారి గురించి వార్తలు వెల్లువెత్తాయి. నాయకులు వారికి సన్మానాలు చేసి, ఫొటోలు దిగారు.

పది రోజుల గడిచాక ఇప్పుడు వాళ్లను పలకరించే వారే లేరు. జీవితం ఎప్పటిలాగానే దయనీయంగా సాగుతోంది.

ఖజూరీ ప్రాంత నివాసి మాలిక్, నవంబరు 30న ఉత్తరాఖండ్ నుంచి బస్తీకి తిరిగివచ్చాడు. స్థానిక బిజెపి మంత్రి, ఎమ్మెల్యే, ఆ పార్టీ ఢిల్లీ ప్రెసిడెంట్ ఇలా ఎంతోమంది నేతలు ఘన స్వాగతం పలికారు. 'రాజాస్ ఆఫ్ ర్యాట్ మైనర్స్' అంటూ కీర్తించారు. మాలిక్ మెడలో పూలదండలు వేశారు. అతను చేసిన ఘనకార్యం గురించి మాట్లాడారు. అయితే ఏ ఒక్కరూ అతను ఎంత ప్రమాదకర పనికి పూనుకున్నాడో ప్రస్తావించలేదు. రక్షణ పరికరాలు, బీమా సౌకర్యం, ఆరోగ్య వసతులు లేని వారంతా కనీస వేతనానికి పనిచేసే దినసరి కార్మికులని ఎవరికీ గుర్తుకురాలేదు.

### ఎప్పుడూ భూగర్భంలోనే ...

'మేమెప్పుడూ భూగర్భంలోనే ఉంటాం. కాబట్టి మా గురించి ఎవరికీ తెలియదు. ఈ రెస్క్యూ ఆపరేషనే మమ్మల్ని ప్రపంచానికి చూపించింది' అని అమాయకంగా అంటున్న మాలిక్ ముస్లిం దళిత కమ్యూనిటీకి చెందిన వాడు. మొత్తం 12 మంది సహాయక బృందంలో బస్తీ నుండి ఐదుగురు, ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన మరో ఏడుగురు కార్మికులు కూడా బలహీన వర్గాలకు చెందినవారే.

### పెద్ద పెద్ద స్టేషన్ల కింద పనిచేస్తాం..

'మేమంతా సొరంగం వద్దకు చేరుకోగానే అక్కడ ఉన్న జనం మమ్మల్ని 'ర్యాట్ మైనర్స్' అని పిలిచారు. ఆ పదం మేము మొదటిసారి విన్నాం. ఆ తరువాత ఈ పది రోజులు మా జీవితం కొత్తగా అనిపించింది. నా ఫోనుకు అదే పనిగా కాల్స్ వచ్చేవి. మా బృందంలోని వాళ్లమంతా ఉతికిన బట్టలు వేసుకుని, తల దువ్వుకుని మీడియా ఇంటర్వ్యూలు ఇచ్చాం. మా చుట్టూ పెద్ద పెద్ద కెమెరాలు పెట్టారు. అవన్నీ మమ్మల్నే చూస్తుంటే మేం ఎటువైపు చూడాలో అర్థం కాలేదు' అని అమాయకంగా అంటున్న మాలిక్, 15 ఏళ్లుగా ఈ పని చేస్తున్నాడు. ముంబయి, రోహతక్, లక్నో, రాంచీ వంటి అనేక ప్రాంతాలలో భూగర్భ పనుల కోసం వెళ్లేవాడు.

యంత్రాలు, ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు, కాంట్రాక్టర్ల నిలువెత్తు చక్రంలో అట్టడుగున ఉన్న కార్మికులు వీరు. 'భూగర్భంలోకి వెళ్లాక మేము అక్కడ ఇంజినీర్లలానే ఆలోచించాలి. మా చుట్టూ ఉన్న మట్టిని అంచనా వేయాలి. ఏ పరికరంతో తవ్వితే సులువుగా ఉంటుందో ఆలోచించాలి. ఒక్కోసారి మేము వెళ్లే మార్గాలు పెద్ద పెద్ద జాతీయ రహదారుల కింద ఉంటాయి. మరోసారి రైల్వే ట్రాక్‌లు, మెట్రో స్టేషను అడుగున మేము పనిచేస్తాం' అని తన అనుభవాలను చెబుతున్నాడు మాలిక్. ఇంత ప్రమాదకర పనిచేస్తే అతనికి వచ్చే రోజు కూలీ రూ.600 మాత్రమే!

### రాత్రుళ్లు నిద్ర పట్టదు..

'మాలిక్ పనికి వెళ్లినప్పుడల్లా నేను భయంతో రోజులు గడుపుతాను. ఈసారి కూడా ఉత్తరాఖండ్‌లో పని ఉంది వెళ్లాలి అన్నప్పుడు కూడా భయపడ్డాను. అక్కడి వార్తలు తెలుసుకోవడానికి మా ఇంట్లో టీవీ కూడా లేదు. ఫోనులో యూట్యూబ్ ఛానెల్స్ ద్వారా సమాచారం తెలుసుకునేదాన్ని. ఒకసారి పని నిమిత్తం, రోహతక్ వెళ్లినప్పుడు అతను చనిపోయినంత పనైంది. సొరంగం మధ్యలో విద్యుత్ షాక్ తగిలి ఆస్పత్రి పాలయ్యాడు. సంపాదించినదంతా ఆస్పత్రి బిల్లులకే ఖర్చు చేసి, ఇంటికి వచ్చాడు. డబ్బులు పోతే పోనీ, మనిషి బతికాడని సంతోషించాను. ఎప్పుడు తాను ఏ పని కోసం వెళ్లినా నేను నిద్ర లేని రాత్రుళ్లు గడుపుతాను' అంటోంది మాలిక్ భార్య.

పిల్లలకు నెలకు రూ.500 స్కూలు ఫీజు కట్టలేక ఆ కుటుంబం తమ ఇద్దరు పిల్లలను ప్రభుత్వ బడికి పంపుతోంది. భర్త తెచ్చే అరకొర ఆదాయం చాలక మాలిక్ భార్య ఓ బట్టల దుకాణంలో పనికి వెళుతోంది.

### మొదట చూసింది నేనే..

మున్నా ఖురేషి (33), ర్యాట్ మైనర్ల బృందంలో కీలక సభ్యుడు. ఉత్తరాఖండ్ సొరంగంలో చిక్కుకున్న కార్మికులను మొదట చూసింది ఇతడే. తండ్రి చనిపోవడంతో ఖురేషి బడి ముఖం కూడా చూడలేదు. ఢిల్లీ వీధుల్లో చెత్త ఏరుకుని జీవించాడు. ఆ తరువాత ర్యాట్ మైనర్‌గా మారాడు. 2021 కోవిడ్ సమయంలో అతని భార్య మరణించింది. పనులతో బయటికి వెళ్లినప్పుడు పిల్లల బాధ్యత అత్తమామలు చూసుకుంటున్నారు. భద్రత లేని మైనింగ్ పనుల నుంచి బయటపడాలని, వేరే పనుల్లోకి వెళ్లాలని ఖురేషి, అతడి మిత్రులు భావించారు. కానీ, అది వారికి కుదరనే లేదు. అలవాటు అయిన ఈ పనికే తమకు పిలుపులు వస్తుంటాయి. కాలుష్యం పెరిగిపోతుందని ఢిల్లీ నగరంలో భూగర్భ గ్యాస్ పైపుల పనిని నిలుపుదల చేయడంతో వీరంతా బస్తీకే పరిమితమయ్యారు. అప్పుడే ఈ రెస్క్యూ ఆపరేషన్ గురించి ఫోన్లు వచ్చాయి.

రెస్క్యూ ఆపరేషన్ పూర్తయ్యాక బస్తీకి తిరిగివచ్చిన ఖురేషిని, అతని బృందాన్ని స్థానిక ఇంటర్నేషనల్ స్కూల్ ఆహ్వానించింది. వారు చేసిన గొప్ప పనికి ఎంతో ప్రశంసించింది. స్కూలు అసెంబ్లీలో విద్యార్థులందరికీ వారిని హీరోలని పరిచయం చేసింది. పిల్లలంతా కరతాళ ధ్వనులతో ఆ బృందాన్ని అభినందించారు. 'ఆ చప్పట్ల మధ్యే నేను ఓ కల కన్నాను.. నా పిల్లలను ఏ రోజైనా ఇక్కడ చూడగలనా' అని అంటున్నప్పుడు ఖురేషి గొంతు జీరబోయింది.

రెస్క్యూ ఆపరేషన్ పూర్తయ్యాక, సహాయక బృందంలో ఒక్కొక్కరికీ రూ.25 వేల నగదు బహుమతిని అందజేశారు. దాంతో పాటు ఓ పూల దండ, బొకే కూడా వారికి అందాయి. ఆ డబ్బులు, ఆ పూలు.. ఈ కీర్తి, ప్రశంసలు శాశ్వతం కావని వారికి తెలుసు. ఏ భూగర్భ చీకట్లోనో తమ బతుకులు కలిసిపోతాయని ఎవరూ వారికి చెప్పనవసరమూ లేదు.. ఇక్కడ.. రక్షించిన, రక్షించబడిన ఇద్దరివీ సమాంతర బతుకులే.. రోజూ ఇలాంటి బతుకులెన్నో, డ్రైనేజీ గుంటల్లోనో.. సొరంగ మార్గాల్లోనో.. తెల్లారిపోతుంటాయి.



మాలిక్ కుటుంబం

# తెలుగు తెరపై తొలి మెరుపులు



గీతికా తివారీ



అనికా సురేంద్రన్



ఆషికా రంగనాథ్

సినిమా ఓ రంగుల ప్రపంచం. ఇక్కడ భాష కంటే భావానికే పెద్దపీట. అందుకే తన, మన అన్న భేదం లేకుండా పరాయి భాషా నటీనటులు కూడా విజయాలను అందుకుంటూ ఉంటారు. ఇక్కడి వారు అక్కడ, అక్కడి వారు ఇక్కడ ఎప్పుడూ వెండితెరను ఏలినవారే. ఏలుతున్నవారే. అలా తెలుగు ఇండస్ట్రీకి పరిచయమై వరుస అవకాశాలతో రాణిస్తున్న శ్రీలీల, సంయుక్త మీనన్ కూడా ఆ జాబితాలో ఉన్నారు. వారి బాటలోనే, మొదటి సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన వారి జాబితా ఈ ఏడాది కాస్తంత పెద్దదే.

ఏడాది ప్రారంభంలో సంతోష్ శోభన్ హీరోగా, యువి క్రియేషన్స్ బ్యానర్‌లో, అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంక్రాంతికి వచ్చిన 'కళ్యాణం కమనీయం' సినిమాతో ప్రియా భవానీ శంకర్ తెలుగు తెరపై తొలిసారి కనిపించారు. తమిళంలో అడపాదడపా నటించినా ఈ సినిమా ఆమె తెలుగు డెబ్యూగా నిలిచిపోయింది. జనవరిలోనే విడుదలైన 'బుట్టబొమ్మ' చిత్రంలో నటించిన అనికా సురేంద్రన్ కూడా తెలుగులో తొలిసారి కథానాయికగా నటించారు. అంతకు ముందు నాగార్జున 'ఘోస్ట్' చిత్రంలో కీలకపాత్రలో కనిపించారు. హీరోయిన్‌గా 'బుట్టబొమ్మ' ఆమెకి తొలి సినిమా.

ఫిబ్రవరిలో విడుదలైన కళ్యాణ్‌రామ్ 'అమిగోస్' చిత్రంలో కనిపించిన ఆషికా రంగనాథ్ డెబ్యూ హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయమయ్యారు. దగ్గుబాటి అభిరామ్ హీరోగా తేజ దర్శకత్వంలో విడుదలైన 'అహింస' సినిమా హీరోయిన్ గీతికా తివారీ కూడా ఇండస్ట్రీకి కొత్త అమ్మాయి. బెల్లంకొండ సాయి గణేశ్‌తో 'నేను స్టూడెంట్ సార్' చిత్రంలో నటించిన అవంతిక దాసానీ బాలీవుడ్ నుంచి తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఈమె అలనాటి నటి భాగ్య శ్రీ కూతురు.



జాన్వీ కపూర్



సాక్షి వైద్య

ఈ ఏడాది సంతోష్ శోభన్ మరో చిత్రంతో వచ్చారు. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో వచ్చిన 'శ్రీదేవి శోభన్ బాబు'తో గౌరి జి.కిషన్ తెలుగులో హీరోయిన్‌గా పరిచయం అయ్యారు. ఆనంద్ దేవరకొండ హీరోగా సాయి రాజేష్ దర్శకత్వంలో వచ్చిన 'బేబీ' చిత్రంలో వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా పరిచయమయ్యారు. అడపాదడపా తెలుగు చిత్రాల్లో కనిపించినా అవన్నీ చిన్న చిన్న పాత్రలే. దీంతో 'బేబీ' చిత్రంతో మొట్టమొదటిసారి హీరోయిన్‌గా నటించి, గొప్ప విజయాన్ని అందుకున్నారు. నాగశౌర్య 'రంగబలి' సినిమాలో హీరోయిన్‌గా నటించిన యుక్తీ తరేజకి తొలిసారి తెలుగుతెరకు పరిచయమయ్యారు.



గౌరి కిషన్



అవంతిక దసాని



ప్రియా భవాని శంకర్

పెద్ద హీరోల సినిమాల్లో కూడా ఈసారి తొలి పరిచయాలు ఎక్కువే ఉన్నాయి. వంశీ దర్శకత్వంలో వచ్చిన రవితేజ సినిమా 'టైగర్ నాగేశ్వరరావు'తో నుపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ పరిచయమయ్యారు. అఖిల్ హీరోగా, సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'ఏజెంట్' చిత్రంలో నటించిన సాక్షి వైద్య డెబ్యూ హీరోయిన్ల జాబితాలో ఉన్నారు. ప్రభాస్, మారుతీ కాంబినేషనల్లో రాబోతున్న 'రాజా డీలెక్స్' చిత్రంలో నటిస్తున్న మాళవిక మోహనన్‌కు ఇది తొలి తెలుగు స్ట్రెయిట్ చిత్రం. ప్రభాస్, నాగ్‌అశ్విన్ కాంబినేషనల్లో రాబోతున్న 'ప్రాజెక్ట్ కె'తో దీపికా పదుకొనే తెలుగులో తొలిసారి నటిస్తున్నారు. ఇక ఎన్‌టిఆర్‌తో కొరటాల తెరకెక్కిస్తున్న 'దేవర' చిత్రంతో బాలీవుడ్ నటి జాహ్నవి తెలుగు తెరకు పరిచయమవుతున్నారు.

# నయా ఎన్‌సిఎ ఆగస్టులో!

**• సకల సౌకర్యాలతో నిర్మాణం • అందుబాటులోకి మరో 8 నెలల్లో**

**ప్రజాశక్తి క్రీడావిభాగం :**

భారత క్రికెట్‌కు కేంద్రం నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సిఎ). భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ఎన్‌సిఎను 2000లో మొదలుపెట్టింది. ముంబయి వాంఖడే స్టేడియంలో బిసిసిఐ ప్రధాన కార్యాలయం తరహాలోనే.. ఎన్‌సిఎను సైతం చిన్నస్వామి స్టేడియంలో ఉంచింది. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కెఎన్‌సిఎ) నుంచి అద్దె ప్రాతిపదికన ఓ ప్రాక్టీస్ గ్రౌండ్, ఇండోర్ సౌకర్యం, జిమ్‌ను తీసుకుంది. భారత క్రికెట్‌లో పెద్ద డబ్బు లేని సమయంలో ఇది చెల్లింది. కానీ 2008 తర్వాత పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. ప్రపంచంలోనే అత్యుత్తమ క్రికెట్ సెంటర్‌ను ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. 2022 ఫిబ్రవరిలో బెంగళూర్ శివారు ప్రాంతంలో 42 ఎకరాల సువిశాల స్థలంతో నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. 2023 ఆగస్టు నాటికి నూతన ఎన్‌సిఎను అందుబాటులోకి తీసుకొస్తామని బిసిసిఐ కార్యదర్శి జై షా ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మినీ వేలం సందర్భంగా వెల్లడించారు.

**రూ.50 కోట్లకు లీజు :** జాతీయ క్రికెట్ అకాడమీని ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ తరహాలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దేందుకు బోర్డు ప్రణాళికలు సిద్ధం చేసింది. అందుకోసం తొలుత కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డు (కెఐఎడిబి) నుంచి 99 ఏండ్లకు 42 ఎకరాల స్థలాన్ని లీజుకు తీసుకుంది. కర్ణాటకలో వరుసగా రాష్ట్ర ప్రభుత్వాలు మారినా.. ఈ భూమిపై నిర్మాణాలు చేపట్టేందుకు హక్కులు బోర్డుకు దఖలు పడలేదు. చివరగా 2017లో ఆ భూమి బిసిసిఐ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో అక్కడ శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు బిసిసిఐ గ్లోబల్ టెండర్లు పిలిచింది. 2022 ఫిబ్రవరిలో ఎన్‌సిఎ నిర్మాణానికి భూమి పూజ జరిగింది.



ఎన్‌సిఎలో ఓ ప్రధాన, రెండు ప్రాక్టీస్ మైదానాలు (గ్రాఫిక్స్)

**సకల సౌకర్యాలు :** స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్‌కు సంబంధిత పరిశోధన కేంద్రాలను సైతం ఇక్కడ ప్రారంభించనున్నారు. 16000 చదరపు అడుగులతో కూడిన వ్యాయామశాల అందులో కీలకం. 40 ప్రాక్టీస్ పిచ్‌లను సిద్ధం చేస్తుండగా, అందులో 20 ప్రాక్టీస్ పిచ్‌లకు ఫ్లడ్‌లైట్ల సదుపాయం కల్పిస్తారు. భారత క్రికెటర్లు, దేశవాళీ టోర్నీల్లో వచ్చిన ఆటగాళ్లతో పాటు బిసిసిఐ ఉన్నతాధికారులు, అతిథులు బస చేసేందుకు ఎన్‌సిఎ ప్రాంగణంలో 243 విలాసవంతమైన గదులు నిర్మిస్తున్నారు. 5 స్టార్ హోటల్ సదుపాయాలను ఈ గదుల్లో కల్పించనున్నారు. నియంత్రిత ఉష్ణోగ్రతతో కూడిన స్విమ్మింగ్‌పూల్‌ను సైతం అందుబాటులోకి తేనున్నారు. ఇక ఓపెన్ ఎయిర్ థియేటర్, ఇండోర్ ట్రైనింగ్ సెంటర్ ఉండనున్నాయి. ఇండోర్ ట్రైనింగ్ సెంటర్‌లో..ఫుట్‌బాల్, స్క్వాష్, బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్ కోర్టులు ఉంటాయి.

**ఐదు జోన్లలో :** నయా ఎన్‌సిఎను ఐదు జోన్లుగా విభజించారు. ఇక్కడ కల్పించనున్న సదుపాయాలను బిసిసిఐ రెండు దశల్లో ఏర్పాటు చేయనుంది. కామన్ ఫెసిలిటీస్‌ను రెండో విడతలో అందుబాటులోకి తీసుకు రానున్నారు. తొలి విడతగా.. ఓ ప్రధాన గ్రౌండ్, ఎన్‌సీఏకు సంబంధించిన పరిపాలన భవనం, పెవిలియన్ బ్లాక్, రెండు ప్రాక్టీస్ మైదానాలు ఉన్నాయి. ఇవి జోన్-1లో ఉంటాయి. ఇక జోన్-2లో అవుట్‌డోర్ ట్రైనింగ్ సెంటర్.. ఇందులో 40 ప్రాక్టీస్ పిచ్‌లు, మల్టీపర్పస్ ఫీల్డింగ్ ఏరియా, స్విమ్మింగ్‌పూల్, సమావేశపు గదులు వంటివి ఉన్నాయి. జోన్-3లో 16000 చదరపు అడుగుల జిమ్ ఉంటుంది. ఒక ఎకరా స్థలంలో అవుట్‌డోర్ ఫెసిలిటీ ఏర్పాటు చేస్తారు. అన్ని వాతావరణ పరిస్థితులకు తగినట్టు తయారు చేసిన పిచ్‌లు జోన్-3లో ప్రత్యేకం. ఇక జోన్-4లో రెసిడెన్షియల్ బ్లాక్ ఉంటుంది. తొలి దశలో సెంట్రల్ కిచెన్, బాంకెట్ హాల్, బస చేసేందుకు 30 విభిన్న గదులను నిర్మించనున్నారు. రెండో విడతలో మిగతా రెసిడెన్షియల్ గదులను నిర్మిస్తారు. జోన్-2లో 20 ప్రాక్టీస్ పిచ్‌లకు ఫ్లడ్‌లైట్లు, రెండు టెన్నిస్ కోర్టులు సైతం రెండో విడతలోనే అందుబాటులోకి వస్తాయి. ఓవరాల్‌గా అన్ని జోన్లకు అందుబాటులో.. చిన్నపిల్లల కేరింగ్ సెంటర్, 7,500 మంది ప్రేక్షకులు కూర్చునేందుకు వీలుగా ప్రధాన గ్రౌండ్‌లో గ్యాలరీ, ఫార్మాసీ, క్షౌరశాల, సైక్లింగ్ ట్రాక్, ఐస్‌క్రీమ్, జ్యూస్ పార్లర్, ఫ్యూయల్ బంక్, స్టేషనరీ షాప్ వంటివి సైతం ఎన్‌సీఏలో భాగంగా నిర్మిస్తున్నారు.

# వర్షార్పణం

- భారత్, సఫారీ తొలి టీ20 రద్దు
- ఎడతెగని వర్షంతో పడని టాస్



**దర్బన్ :** దక్షిణాఫ్రికాలో టీమ్ ఇండియా పర్యటన వరుణుడి ఆటతో మొదలైంది. టీ20, వన్డే, టెస్టు సిరీస్ కోసం సఫారీ గడ్డపై కాలుమోపిన భారత జట్టు.. 2024 టీ20 ప్రపంచకప్ సన్నాహకంలో కీలక మ్యాచ్ ప్రాక్టీస్‌ను కోల్పోయింది. తొలి టీ20 వేదిక డర్బన్‌లో మ్యాచ్ సమయానికి గంట ముందు నుంచే ఎడతెగని వర్షంతో.. కనీసం టాస్ కూడా సాధ్యపడలేదు. వర్షం నిలకడగా కొనసాగటంతో తొలి టీ20ని రద్దు చేస్తూ ఫీల్డ్ అంపైర్లు నిర్ణయం తీసుకున్నారు. భారత్, దక్షిణాఫ్రికా రెండో టీ20 మ్యాచ్ మంగళవారం జరుగనుంది.

అభిమానులకు నిరాశ : అగ్ర జట్టు భారత్ రాకతో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ఖజానా నింపుకునే పనిలో నిమగ్నమైంది. అందులో బోర్డు పూర్తిగా విజయవంతమైంది. డర్బన్ టీ20 మ్యాచ్‌కు ఓ నెల రోజుల ముంగిటే టికెట్లు పూర్తిగా అమ్ముడయ్యాయి. భారత జట్టు మూడు ఫార్మాట్ల పర్యటనతో సుమారు రూ.450 కోట్లు ఆర్జించేందుకు రంగం సిద్ధం చేసుకున్న దక్షిణాఫ్రికాకు.. ఆరంభం కలిసి రాలేదు. హౌస్‌ఫుల్ స్టేడియం.. వర్షం రాకతో నిరుత్సాహానికి గురైంది. టీమ్ ఇండియా అభిమానులు వర్షంలోనూ మ్యాచ్‌పై ఆశలు పెంచుకున్నారు. మ్యాచ్ రద్దు ప్రకటన వచ్చే వరకూ ఓపిగ్గా స్టేడియంలోనే ఎదురుచూశారు. అయితే, వర్షం తగ్గే సూచనలు ఏమాత్రం లేకపోవటంతో ఇరు జట్ల క్రికెటర్లు డ్రెస్సింగ్‌రూమ్‌కు మాత్రమే పరిమితమయ్యారు. మ్యాచ్ రద్దు కావటంతో అభిమానులకు టికెట్ల సొమ్మును సఫారీ క్రికెట్ బోర్డు 100 శాతం తిరిగి చెల్లించనుంది.

అనూహ్యంగా వరుణుడు : వాతావరణ శాఖ సమాచారం ప్రకారం తొలి టీ20కి వర్షం ముప్పు లేదు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం వరకు వర్షం సూచనలు ఉన్నాయి. కానీ మ్యాచ్ సమయానికి వాతావరణం క్లియర్‌గా ఉందని తొలుత తెలిపింది. ఉదయం చిరుజల్లులు తొలి ఇన్నింగ్స్‌లో బౌలర్లకు అనుకూలిస్తుందనే అంచనాతో స్టేడియానికి వచ్చిన క్రికెటర్లకు.. వరుణుడు షాక్ ఇచ్చాడు. టాస్ ముంగిట వర్షం షురూ కావటంతో.. అటు ఆటగాళ్లలో, ఇటు అభిమానుల్లో ఆందోళన మొదలైంది. చివరకు 5 ఓవర్ల మ్యాచ్‌కు సైతం వాతావరణం అనుకూలించే పరిస్థితులు లేకపోవటంతో ఫీల్డ్ అంపైర్లు మ్యాచ్ రద్దు నిర్ణయం తీసుకున్నారు.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68